విశ్వ క్రీడా వేదికపై నేడు విశాఖ యువతి ప్రదర్శన



పారిస్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌పై ఎర్రాజీ జ్యోతి

- 100 మీటర్ల హర్డిల్స్ తొలి రౌండ్ హీట్స్‌కు సన్నద్ధం
- మధ్యాహ్నం 1.55 గంటలకు రేస్ ప్రారంభం... బలమైన ప్రత్యర్థులతో పోటీ
- ఫైనల్స్‌కు చేరడంపై ఆశాభావం

·7లో



ఎమ్మెల్సీ అభ్యర్థి పీలా గోవింద

ఖరారు చేసిన కూటమి నాయకులు

- నేడు అధికారికంగా ప్రకటన
- గెలుపునకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రణాళిక
- పర్యవేక్షణకు ముగ్గురు మంత్రులు, ఒక ఎంపీ
- ప్రాంతాల వారీగా బాధ్యతలు అప్పగింత
- వైసీపీ నుంచి భారీగానే వలసలు?

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఎమ్మెల్సీ (స్థానిక సంస్థల కోటా) స్థానానికి కూటమి అభ్యర్థిగా అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద పేరు ఖరారైనట్టు విశ్వసనీయంగా తెలిసింది. విశాఖ జిల్లా టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జీ, అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద, మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, అనకాపల్లి ఎంపీ సీటు ఆశించిన బైరి దిలీప్ చక్రవర్తి, ఎలమంచిలి ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, భీమిలి నియోజక వర్గానికి చెందిన కోరాడ రాజబాబు, తదితరులు పోటీకి ఉత్సాహం చూపించారు. ఈ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం రాత్రి జరిగిన సమావేశంలో నేతలు సుదీర్ఘంగా చర్చించి, ఆసక్తి చూపుతున్న వారందరి పేర్లు పార్టీ అధినేత చంద్రబాబునాయుడుకు పంపించారు. గండి బాబ్జీ మంగళవారం విజయవాడ వెళ్లి చంద్రబాబును కలిశారు. అన్నింటినీ పరిశీలించిన తరువాత పీలా గోవింద పేరు ఖరారు చేసినట్టు సమాచారం. ఈ సందర్భంగా పార్టీ నాయకులకు యువ నేత, మంత్రి నారా లోకేశ్ కొన్ని సూచనలు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోను ఉమ్మడి విశాఖ ఎమ్మెల్సీ స్థానాన్ని కూటమి గెలుచుకొని తీరాలని స్పష్టంచేశారు. ఏ ప్రజాళిక వేసినా పక్కాగా ఉండాలని, ఎవరూ చేజారి పోకుండా చూసుకోవాలని సూచించారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్‌లతో పాటు అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ విశాఖలోనే ఉండి ఈ ఇరవై రోజులు పనిచేయాలని ఆదేశించారు. జిల్లాకు చెందిన మంత్రి వంగలపూడి అనిత కూడా ఈ ఎన్నిక బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఇక్కడకు వచ్చే మంత్రులు ప్రాంతాల వారీగా బాధ్యతలు తీసుకొని పనిచేయనున్నట్టు సమాచారం. జీవీఎంసీ మొత్తం అచ్చెన్నాయుడు చూసుకుంటారని విశ్వసనీయంగా తెలిసింది. పాడేరు, అరకులోయ నియోజకవర్గాల ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యుల బాధ్యతను ఎంపీ సీఎం రమేశ్‌కు అప్పగించనున్నట్టు తెలిసింది.

నేడు అధికారికంగా అభ్యర్థి ప్రకటన

ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీలా గోవింద్ పేరును కూటమి నాయకత్వం బుధవారం ప్రకటించనుంది. అనేక మంది ఈ సీటు కోసం ప్రయత్నించినా అధిష్ఠానం గవర సామాజిక వర్గానికి చెందిన గోవింద్‌కే ఇవ్వాలని నిర్ణయించింది. వైసీపీ కాపు సామాజిక వర్గానికి చెందిన బొత్స సత్యనారాయణను రంగంలోకి దించినందున కూటమి అభ్యర్థి కూడా అదే సామాజికవర్గం అయితే బాగుంటుందని పలువురు పార్టీ పెద్దలకు సూచించారు.

అదేవిధంగా మాడుగుల, పశ్చిమ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, గణబాబులు కూడా అభ్యర్థి ఎవరైతే బాగుంటుందో సీఎం చంద్రబాబును కలిసి వివరించారు. అందరి వాదనలు, అభిప్రాయాలు తెలుసుకున్న తరువాత గోవింద్ పేరు ... మిగతా 8వ పేజీలో

ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ

13వ తేదీ వరకు నామినేషన్ల స్వీకారం

- 30న పోలింగ్, సెప్టెంబరు 3న కౌంటింగ్

విశాఖపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఎన్నికల సంఘం మంగళవారం జారీ చేసింది. ఈ నెల 13వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 14న వాటిని పరిశీలిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు 16వ తేదీ వరకు గడువు ఇచ్చారు. ఈ నెల 30వ తేదీన పోలింగ్ నిర్వహిస్తారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుంది.

సెప్టెంబరు మూడో తేదీన ఓట్లను లెక్కించి ఎవరు ఎన్నికైనదీ ప్రకటిస్తారు. సెప్టెంబరు 6వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రకటనలో పేర్కొన్నారు.

మహా ఉత్కంఠ

నేడే జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక



- 49కి పెరిగిన కూటమి బలం
- 47కి తగ్గిన వైసీపీ బలం
- అందులోనూ మరో నలుగురు వైవీ సుబ్బారెడ్డి సమావేశానికి డుమ్మా
- వారంతా కూటమికి మద్దతు ప్రకటిస్తారని ప్రచారం
- కార్పొరేటర్లను శిబిరాలకు తరలించిన ఇరు వర్గాలు
- ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నట్టు సీపీఎం కార్పొరేటర్ గంగారావు ప్రకటన
- వైరిపక్షాల ఓట్ల కోసం ఇరుపక్షాల ప్రయత్నాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక రసకందాయంగా మారింది. వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ కంటే కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి) స్వల్ప ఆధిక్యం కలిగి ఉండడంతో ఎన్నికపై ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం కూటమికి 49 మంది కార్పొరేటర్ల బలం ఉండగా, వైసీపీకి 47 మంది బలం ఉంది. దీంతో ఇరుపక్షాలు తమ కార్పొరేటర్లను బుధవారం నేరుగా పోలింగ్ కేంద్రం వద్దకు తీసుకొచ్చేలా శిబిరాల్లో ఉంచాయి. వైసీపీ నుంచి మరి కొందరు తమ వైపు వచ్చేస్తారని కూటమి నేతలు చెబుతుంటే, తమకు కూటమిలోని కార్పొరేటర్లు ఓటేస్తారని వైసీపీ నేతలు చెబుతుండడంతో ఇరువర్గాల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది.

జీవీఎంసీలో అత్యంత కీలకమైన స్టాండింగ్ కమిటీకి బుధవారం ఎన్నిక జరగనున్నది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నుంచి పది మంది కార్పొరేటర్లు, వైసీపీ నుంచి పది మంది కార్పొరేటర్లు పోటీలో నిలిచారు. జీవీఎంసీలో 98 వార్డులు ఉండగా ప్రస్తుతం 97 మంది కార్పొరేటర్లు మాత్రమే ఉన్నారు. కార్పొరేటర్లకు మాత్రమే స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఓటు హక్కు ఉంటుంది. జీవీఎంసీ చేపట్టే రూ.50 లక్షలలోపు విలువైన పనులతో పాటు పరిపాలనా పరమైన నిర్ణయాలను తీసుకునే అధికారం స్టాండింగ్ కమిటీకి ఉంటుంది. దీంతో స్టాండింగ్ కమిటీ ఆమోదం పొందితే ఆయా పనులు చేపట్టేందుకు, బిల్లులు చెల్లించేందుకు ఇబ్బంది ఉండదు. రూ.50 లక్షలకు పైబడిన పనులు, నగరమంతటికీ వర్తించే నిర్ణయాలను మాత్రమే కౌన్సిల్‌లో పెట్టి ఆమోదం పొందాల్సి ఉంటుంది. కౌన్సిల్ సమావేశం ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగితే స్టాండింగ్ కమిటీ సమావేశం మాత్రం రెండు వారాలకు ఒకసారి జరుగుతుంది. అందువల్ల ముఖ్యమైన నిర్ణయాలన్నీ దాదాపు స్టాండింగ్ కమిటీ ... మిగతా 8వ పేజీలో

స్టాండింగ్ కమిటీ ఎన్నికకు సర్వం సిద్ధం

ఉదయం పదిన్నరకు పోలింగ్ ప్రారంభం

- సాయంత్రం ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడి
- ఏర్పాట్లు పూర్తిచేసిన జీవీఎంసీ అధికారులు
- జీవీఎంసీ కార్యాలయం వద్ద పోలీస్ భద్రత

విశాఖపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోలింగ్ బుధవారం ఉదయం 10.30 ప్రారంభమై మధ్యాహ్నం రెండు గంటలకు ముగుస్తుంది. సాయంత్రం ఓట్లు లెక్కించి, ఫలితాలను వెల్లడిస్తారు. పోలింగ్ సందర్భంగా పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేయాలని సీపీ శంఖబ్రతబాగ్చిని జీవీఎంసీ అధికారులు కోరారు.

జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పాత కౌన్సిల్‌హాల్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటుచేశారు. ఓటు హక్కు కలిగిన 97 మంది కార్పొరేటర్లు ఓటు వేసేందుకు వచ్చినప్పుడు విధిగా తమ గుర్తింపు కార్డును తీసుకురావాల్సి ఉంటుంది. పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు, పెన్నులుగానీ అనుమతించరు. కార్పొరేటర్లు తమ సెల్‌ఫోన్‌లు, పెన్ను, వాచీలు వంటి వస్తువులను పోలింగ్ కేంద్ర ప్రవేశం వద్ద ఉండే ఓటరు ఐడెంటిఫికేషన్ ఆఫీసర్‌కు అప్పగించాల్సి ఉంటుంది. అనంతరం తమ గుర్తింపు కార్డును చూపించి, ఓటరు స్లిప్ తీసుకుని పోలింగ్ కేంద్రంలోకి వెళ్లాల్సి ఉంటుంది. పోటీలో ఉన్న 20 మంది అభ్యర్థుల పేర్లు తెలుగు అక్షరమాల క్రమంలో పది మందివి ఒకవైపు, మరో పది మందివి మరొకవైపు బ్యాలెట్ పేపర్‌పై ఉంటాయి. ఒక ఓటరు గరిష్ఠంగా పది మందికి మాత్రమే ఓటు వేయాల్సి ఉంటుంది. ఒకవేళ 11 మందికి ఓటేస్తే ఆ ఓటు చెల్లనిదిగా పరిగణిస్తారు. పోలింగ్ బూత్‌లో ఉండే స్టాంపెడ్, ఇంటు మార్కు కలిగిన పరికరంతో తాము ఓటు వేయాలనుకుంటున్న అభ్యర్థి పేరు ఎదురుగా 'ఇంటు' మార్కును ముద్రించి బ్యాలెట్ పేపర్‌ను బాక్స్‌లో వేయాల్సి ఉంటుంది.

పాఠశాలల ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదా?

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అడ్డంకి

- కలెక్టర్ ఆదేశాలతో ఈసీకి లేఖ రాసిన డీఈవో

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసి తల్లిదండ్రుల కమిటీల స్థానంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకున్న పాఠశాల యాజమాన్య (స్కూల్ మేనేజ్‌మెంట్) కమిటీల (ఎస్ఎంసీ) ఎన్నికలు వాయిదా పడే అవకాశాలున్నాయి.

ఈ నెల 30వ తేదీ వరకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉంది. ఈ నేపథ్యంలో ఎస్ఎంసీ నిర్వహించవచ్చా?, లేదా? అనే దానిపై ఎన్నికల కమిషన్‌కు డీఈవో వెంకటలక్ష్మమ్మ మంగళవారం లేఖ రాశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను బట్టి నిర్ణయం తీసుకోనున్నారు.



పరవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

గతంలో ఉన్న తల్లిదండ్రుల కమిటీల పదవీకాలం పూర్తవడంతో కొత్తగా పాఠశాల యాజమాన్య కమిటీల నియామకం కోసం ఈనెల 8న ఎన్నికలు జరిపేందుకు పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు జిల్లాలో 1,424 పాఠశాలల్లో కొత్త కమిటీల నియామకాల కోసం ఈ నెల 1న జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ఎన్నికల నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. కమిటీల చైర్మన్లు, సభ్యులుగా పోటీపడేవారు సంబంధిత పాఠశాలలో చదువుతున్న పిల్లల తల్లిదండ్రులై ఉండాలని, అదే విధంగా తప్పనిసరిగా స్థానికంగా ఉండాలనే నిబంధన పెట్టారు. అన్ని పాఠశాలల బోర్డులపై ఎన్నిక షెడ్యూల్, మార్గదర్శకాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు ఎలా నిర్వహిస్తారంటూ కొంతమంది అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీనిపై కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదులు అందడంతో షెడ్యూల్ ప్రకారం ఈ నెల 8న జరగాల్సిన పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు నిర్వహించాలా?, వాయిదా వేసి ఎమ్మెల్సీ ఎన్నికల తరువాత నిర్వహించాలా? అనేదానిపై కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ ఎన్నికల కమిషన్‌కు మంగళవారం లేఖ రాశారు. ఎన్నికల కమిషన్ నుంచి వచ్చే మార్గదర్శకాల ఆధారంగా పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు జరపాలా?, వాయిదా వేయాలా? అనేది నిర్ణయించాలని జిల్లా అధికారులు భావిస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం ఎన్నికల నిర్వహణకు ఒక్కరోజే గడువు ఉన్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నుంచి బుధవారం ఆదేశాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. ఒక వేళ ఎన్నికల కమిషన్ కోడ్‌తో సంబంధం లేకుండా పాఠశాల యాజమాన్య కమిటీల నియామకాలు జరుపుకోవచ్చని మార్గదర్శకాలు వస్తే, ఈ నెల 8న షెడ్యూల్ ప్రకారం పాఠశాలల్లో యాజమాన్య కమిటీల నియామకాల ప్రక్రియ కొనసాగుతుందని, లేని పక్షంలో వాయిదా వేస్తామని జిల్లా విద్యాశాఖాధికారి ఒకరు తెలిపారు.

కొనసాగుతున్న కష్టాలు

చీడికాడ, ఆగస్టు 6:

జిల్లాలో అన్ని గ్రామాల్లో ఇప్పటికే రైతులు వరినాట్లు వేయగా, చీడికాడ మండలంలోని జైతవరం, చినగోగాడ తదితర గ్రామాల్లో ఇంత వరకు వరినాట్లు వేసుకోలేని దయనీయ పరిస్థితి ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన సాగునీరు అందించే మర్లగుమ్మి కాలువపై కాలిబాట వంతెన నిర్మాణం నత్తనడకన సాగుతుండడం, ఈ పనుల వల్ల పక్కన ఉన్న సాగునీటి కాలువ మట్టితో పూడుకుపోవడం వల్ల పొలాలకు నీరు అందడం లేదు. దీంతో ఆరు గ్రామాల్లో వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు.

మండలంలోని ఆరు గ్రామాల్లో ఇప్పటికీ వరినాట్లు వేసుకోలేని దుస్థితి

- వంతెన నిర్మాణం వల్ల సాగునీటి కాలువ పూడుకుపోవడంతో ఇబ్బందులు
- బీడు భూములుగా మారుతున్న పొలాలు
- పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- ఆయకట్టు రైతుల గగ్గోలు



డోకలవారి కళ్లాల వద్ద కాలువపై నిర్మిస్తున్న వంతెన



మర్లగుమ్మి ఆనకట్టు నుంచి కాలువలో పారని సాగునీరు

మర్లగుమ్మి ఆనకట్టు నుంచి డోకలవారి కళ్లాల మీదుగా జైతవరం, జి.కొత్తపల్లి, బైలపూడి, ఎ.అగ్రహారం, చినగోగాడ, వరహాపురం, వింటిపాలెం, తునివలస గ్రామాల్లో పొలాలకు సాగునీరు వెళ్లేందుకు గతంలో కాలువలు నిర్మించారు. ఆనకట్ట కింద సుమారు 4,500 ఎకరాల ఆయకట్టు ఉంది. ఆనకట్టకు సమీపంలో డోకలవారి కళ్లాల నుంచి పొలాలకు వెళ్లేందుకు కాలిబాట వంతెనను సాగునీటి కాలువపై 40 ఏళ్ల క్రితం అప్పటి అధికారులు నిర్మించారు. ఆ వంతెన రెండేళ్ల క్రితం తుఫాన్‌కు కూలిపోయింది. దీంతో రైతులు తమ పొలాలకు వెళ్లి పంటలు తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు రైతులు పలుమార్లు విన్నవించుకున్నారు. దీంతో ప్రభుత్వం వంతెన నిర్మాణానికి రూ.78 లక్షలు మంజూరు చేసింది. కాలువపై వంతెన నిర్మాణ పనులను కాంట్రాక్టర్ గత ఏడాది ప్రారంభించి దిమ్మలు వరకు పూర్తి చేశారు. ప్రస్తుతం 50 శాతం పనులు పూర్తయ్యాయి. అయితే ఈ పనుల వల్ల పక్కనే ఉన్న సాగునీటి కాలువ మట్టితో పూడుకుపోయింది. దీంతో మర్లగుమ్మి ఆనకట్ట నుంచి వస్తున్న సాగునీరు తమ పొలాలకు రాకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. మండలంలోని అన్ని గ్రామాల్లో వరినాట్లు వేస్తుండగా తమ గ్రామాల్లో పొలాలకు సాగునీరు అందక వరినాట్లు వేయలేకపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలువలో పేరుకుపోయిన మట్టిని తొలగించకపోవడంతో పంట పొలాలు బీడు భూములుగా మారుతున్నాయని వాపోతున్నారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ సీహెచ్ జయరామ్‌పడాల్‌ను వివరణ కోరగా మట్టిని తొలగించి సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పీఏసీఎస్ అవకతవకలపై విచారణ షురూ

జానకీరామపురం కార్యాలయాన్ని సందర్శించిన విచారణ అధికారి

నర్సీపట్నం, ఆగస్టు 6:

రోలుగుంట మండలం జానకీరామపురం పీఏసీఎస్‌లో జరిగిన అవకతవకలపై విచారణ మొదలైంది. నర్సీపట్నం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్‌కి విచారణ అధికారి ఐవీ రమణమూర్తి మంగళవారం సమన్లు జారీ చేశారు. పీఏసీఎస్ సీఈవోపై వచ్చిన అభియోగాలపై తగిన ఆధారాలతో జానకీరామపురం పీఏసీఎస్‌కి ఈ నెల 14 తేదీన విచారణకు రావాలని పేర్కొన్నారు. రికార్డులు తనిఖీ కోసం జానకీరామపురం పీఏసీఎస్‌కి విచారణ అధికారి వెళ్లారు. అనివార్య కారణాల వల్ల రికార్డుల పరిశీలన జరగకపోవడంతో వెనుతిరిగారు. మరో రోజు వచ్చి రికార్డులు పరిశీలిస్తామని విలేకరులకు ఆయన తెలిపారు.

పీఏసీఎస్ సీఈవోపై ఫిర్యాదుల వెల్లువ

జానకీరామపురం సీఈవో కృష్ణపై ఫిర్యాదులు వెల్లువెత్తు తున్నాయి. పీఏసీఎస్‌లో అవకతవకలపై 40 మందికి పైగా రైతులు లిఖిత పూర్వంగా ఉన్నతాధికారులు ఫిర్యాదు చేశారు. రుణం తీసుకోకపోయినా రుణం తీసుకున్నట్టు సీఈవో నోటీసులు పంపారని రోలుగుంట మండలం కుసర్లపూడి గ్రామానికి చెందిన గొల్లు కల్పన, కిల్లాడ అప్పల సీతయ్యనాయుడు ఫిర్యాదు చేశారు. పీఏసీఎస్‌లో బినామీ పేర్లతో రుణాల మంజూరు, నిధుల దుర్వినియోగం జరిగిందని, దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని పచ్చిగోళ్ల నారాయణరావు, గొల్లు నారాయణరావు, తదితరులు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.



జానకీరామపురం పీఏసీఎస్ కార్యాలయం వద్ద విచారణ అధికారి ఐవీ రమణమూర్తి, తదితరులు

వివాదాస్పద భూముల విచారణపై మీనమేషాలు

- పోలీసు కేసు నమోదైనా స్పందించని రెవెన్యూ యంత్రాంగం
- న్యాయం కోసం కోర్టును ఆశ్రయించిన బాధితులు

అనకాపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాంబిల్లి మండలం పంచదార్ల రెవెన్యూ పరిధిలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాయకులు యదేచ్ఛగా సాగించిన భూ కబ్జాలు, దోపిడీలపై బాధితులు ఫిర్యాదు లు చేసినా స్థానిక రెవెన్యూ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదన్న విమర్శలు న్నాయి. దీంతో ఓ బాధి తుడు న్యాయం కోసం కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. పారిశ్రామిక ప్రాంతం కావడంతో ఇక్కడ భూముల విలువ బాగా పెరిగింది. దీంతో భూ కబ్జాదారులు, రెవెన్యూ అధికారులు ఏకమై రెవెన్యూ వెబ్‌ల్యాండ్ రికార్డులను ట్యాంపరింగ్ చేసి భూఆక్రమణదారులకు తెగ బద్దారన్న ఆరోపణలు ఉన్నాయి. రాంబిల్లి మండలం పం చదార్ల రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 76/2 లోని 35 సెంట్ల ... మిగతా 8వ పేజీలో



పంచదార్లలో రెవెన్యూ రికార్డులు ట్యాంపరింగ్ జరిగిన భూమి ఇదే

క్రైం... crime news

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

కొత్తూరు, ఆగస్టు 6: మనస్తాపానికి గురైన ఓ వృద్ధుడు పురుగుల మందు తాగి మృతి చెందాడని అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ పి.భాస్కరరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలివి. అనకాపల్లి మండలం వెంకుపాలెం గ్రామానికి చెందిన రాపేటి సత్యనారాయణ(69) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో మనస్తాపం చెంది పశువుల పాకలో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన అతని కుటుంబ సభ్యులు వెంటనే అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. అయితే సమయం తక్కువగా ఉండడంతో విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడ రాత్రి 10 గంటలకు చికిత్స పొందుతూ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడి కుమారుడు అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరు ఉద్యోగులకు గాయాలు

చీడికాడ, ఆగస్టు 6: మండలంలోని బైలపూడి సచివాలయంలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. చోడవరం నుంచి సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ యశ్వంత్ కుమార్, ఇంజినీర్ అసిస్టెంట్ మంజూష బైక్‌పై బైలపూడి వస్తుండగా వరహాపురం వద్ద అడ్డంగా కుక్క రావడంతో పడిపోయారు. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. దీంతో వరాహాపురంలో ఆర్ఎంపీ డాక్టర్ ప్రథమ చికిత్స చేశారు.

పేకాట శిబిరంపై దాడి

▸ 11 మంది అరెస్టు

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 6: మండలంలోని నామవరం గ్రామ శివారులో సోమవారం సాయంత్రం పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి 11 మందిని అరెస్టు చేసినట్టు సీఐ అప్పలరాజు తెలిపారు. వారి నుంచి సుమారు రూ.38,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

అవయవదానంతో ఏడుగురికి పునర్జన్మ

మత్స్యకార మహిళ బెయిన్ డెడ్ కావడంతో

అవయవదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులు



అవయవదానం చేసిన అడివరం

అచ్యుతాపురం, ఆగస్టు 6: బ్రెయిన్ డెడ్ అయిన ఒక మత్స్యకార మహిళ అవయవ దానం చేయడానికి కుటుంబ సభ్యులు అంగీకరించారు. దీంతో మంగళవారం షీలానగర్‌లో గల కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో అవయవ దానం చేశారు.

మండలంలోని పూడిమడకకు చెందిన యజ్జల అడివరం (38) ఈనెల మూడు రాత్రి హైబీపీతో ఇంటి వద్ద పడిపోయింది. తొలుత ఆమెకు అనకాపల్లిలో ఒక ప్రవేటు ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో విశాఖ షీలానగర్‌లో గల కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ డాక్టర్లు పరీక్షలు నిర్వహించి బ్రెయిన్ డెడ్ అయిందని ఈనెల ఐదో తేదీ మధ్యాహ్నం తెలిపారు. అయితే అవయవ దానం చేస్తే ఏడుగురికి ప్రాణదానం చేసినట్టవుతుందని వైద్యులతో పాటు జీవదాన్ ట్రస్టు సభ్యులు అడివరం కుటుంబ సభ్యులకు వివరించారు. కుటుంబ సభ్యులు అంగీకరించడంతో మంగళవారం ఉదయం అవయవదానం అనంతరం పూడిమడకలో అంత్యక్రియలు జరిపారు.

పటిష్టంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి

▸ విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, ఆగస్టు 6: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని నోడల్ అధికారులను కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఈ నెల 30వ తేదీ న ఈఎన్నిక జరగనున్న నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్ సమా వేశ మందిరంలో రెవెన్యూ, పోలీసు, ఇతర విభాగాల అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ ఎన్నికల్లో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన కూడళ్లలో చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలన్నారు. 24 గంటలూ సిబ్బందిని అందుబాటులో ఉంచి తనిఖీలు కొనసాగించాలని ఆదేశించారు. ఎన్నిక సజావుగా సాగేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. అలాగే, పలు అంశాలపై మార్గదర్శకాలను జారీ చేశారు. ప్రజా ప్రతినిధుల అనుమ తులకు సంబంధించి కలెక్టరేట్‌లో సింగిల్ విండో విధానం అందుబాటులోకి తీసుకురావాలని, జిల్లా పరిధి రాజకీయ విగ్రహాలకు ముసు గులు వేయాలని, పోస్టర్లు తొలగించాలని సూచించారు. అనుమతులు లేకుండా రాజకీయ సమావేశాలు, ర్యాలీలు జరపడానికి వీలు లేదన్నారు. ఎంసీసీ కమిటీలు నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. పత్రికలు, టీవీలలో వార్తా కథనాలను పర్యవేక్షించాలన్నారు. ప్రక టనలకు సార్వత్రిక ఎన్నికలో మాదిరిగానే ఎంసీఎంసీ నుంచి అ నుమతులు తీసుకోవాలని కోరారు. నిబంధనలు కచ్చితంగా పాటించి సహకరించాలని వివిధ రాజకీయ పార్టీలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జేసీ మయూరి అశోక్, జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్ కమార్ , జాయింట్ కమిషనర్ ఫకీరప్ప, డీఆర్‌వో, ఆర్‌డీవో తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో విశాఖకు ఒకే ఒక్క పరిశ్రమ

▸ లోక్‌సభలో ఎంపీ శ్రీభరత్ ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం

ఎంవీపీ కాలనీ (విశాఖపట్నం), ఆగస్టు 6: విశాఖకు గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో కేవలం ఒకే ఒక్క పరిశ్రమ వచ్చిందని లోక్‌సభలో మంగళవారం ప్రస్తుత ఎంపీ ఎం.శ్రీభరత్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. దివీస్ లేబొరేటరీస్ ఈవోయూ విభాగం 2021-22లో బల్క్ డ్రగ్, ఫార్మాస్యూటికల్స్ రంగంలో ఉత్పత్తిని ప్రారంభించిందని, అది మినహా కొత్త పరిశ్రమలేవీ విశాఖ జిల్లాకు రాలేదని మంత్రి వెల్లడించారు. కాగా రాష్ట్రంలో కేన్సర్ స్ర్కీనింగ్ టెస్టులు విరివిగా చేయించాల్సిన పరిస్థితి ఉందని కేంద్రానికి ఎంపీ ఎం.శ్రీభరత్ విజ్ఞప్తి చేశారు. ఐదేళ్లలో దేశంలో కేన్సర్ కేసులు 13 శాతం పెరిగాయని, 2025 నాటికి 1.57 మిలియన్ కేసులు నమోదయ్యే అవకాశం ఉందని పరిశోధన సంస్థలు చెబుతున్నాయన్నారు. ఇలాంటి ప్రమాదకర వ్యాధులను ముందస్తుగా గుర్తించడం వల్ల ఎక్కువ మంది ప్రాణాలను కాపాడవచ్చునన్నారు. అమెరికాతో పోలిస్తే మనదేశంలో స్ర్కీనింగ్ రేటు చాలా తక్కువగా ఉందని అన్నారు. పరీక్షలు చేయించడం, కేన్సర్ పరిశోధనలకు మరిన్ని నిధులు కేటాయించడం, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా కేన్సర్ గుర్తింపు, ఇతర చికిత్సల్లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా శ్రీభరత్ విజ్ఞప్తి చేశారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి పక్కాగా ఏర్పాట్లు

విశాఖపట్నం, ఆగస్టు 6: జిల్లాలో ఈ నెల 23 నుంచి సెప్టెంబరు 5 వతేదీ వరకు జరుగనున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి పక్కా ఏ ర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో ఆర్మీ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. అక్కయపాలెం పోర్టు ట్రస్టు డైమండ్ జూబ్లీ స్టేడియంలో నిర్వహించనున్న ఆర్మీ ర్యాలీలో రాష్ట్రంలో 13 జిల్లాలకు చెందిన 8 వేల మంది యువత పాల్గొననున్నారన్నారు. ఈ ర్యాలీ సాఫీగా జరిగేందుకు జిల్లా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ఏర్పాట్ల సమన్వయం కోసం సెట్విజ్ సీఈవో డి. కీర్తి, డీఎస్‌డీవో జాన్ గ్యాలియట్‌లను నోడల్ అధికారులకుగా నియమించనున్నట్టు తెలిపారు. ర్యాలీ జరుగుతున్న సమయంలో స్టేడియం వద్ద తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులను ఏర్పాటు చే యాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌ను కోరారు. ఆర్మీ అధికారులతో జిల్లా యంత్రాంగంతో సమన్వయంతో పనిచేసేందుకు ఓ సీనియర్ అధికారిని నియమించాలని ఆదేశించారు. అభ్యర్థులు వేచి ఉండేందుకు, వైద్య పరీక్షలు, రిజిస్ట్రేషన్లకు ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. రెండు అంబులెన్స్‌లతోపాటు అవసరమైన వైద్యులు, సిబ్బంది మందులతోపాటు సమీప ఆసుపత్రిలో ఏర్పాట్లు చేయాలని సూచించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	75.00
లైవ్ ధర	95.00
విత్ స్కిన్	160.00
స్కిన్ లెస్	170.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

విశ్వ క్రీడా వేదికపై

నేడు విశాఖ యువతి ప్రదర్శన

పారిస్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌పై ఎర్రాజీ జ్యోతి

100 మీటర్ల హర్డిల్స్ తొలి రౌండ్ హీట్స్‌కు సన్నద్ధం

మధ్యాహ్నం 1.55 గంటలకు రేస్ ప్రారంభం..

బలమైన ప్రత్యర్థులతో పోటీ

ఫైనల్స్‌కు చేరడంపై ఆశాభావం



విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 6:

విశాఖకు చెందిన అంతర్జాతీయ అథ్లెట్ ఎర్రాజీ జ్యోతి బుధవారం ఒలింపిక్స్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో పరుగు తీయనున్నది. 100 మీటర్ల హర్డిల్స్‌లో భారత్ సత్తా చాటేందుకు సన్నద్ధమవుతోంది. ఒలింపిక్స్‌లో భారత దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న తొలి మహిళా 100 మీటర్ల హర్డలర్‌గా జ్యోతి రికార్డు నెలకొల్పింది. తాను నెలకొల్పిన జాతీయ రికార్డులను తిరగరాసుకుంటూ ఫాస్టెస్ట్ రేసర్‌గా గుర్తింపుపొందిన ఎర్రాజీ జ్యోతి...విశ్వ క్రీడల్లో కూడా తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమవుతోంది.

క్రీడాభిమానులలో ఆకాంక్ష

ఆసియా క్రీడల్లో రజత పతకం సాధించిన జ్యోతి...ర్యాంకింగ్ ఆధారంగా ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. ప్రపంచవ్యాప్తంగా సమ్మర్ ఒలింపిక్స్‌కు ర్యాంకింగ్ ఆధారంగా 40 మంది అర్హత సాధించగా, ఎర్రాజీ జ్యోతి 34వ ర్యాంకుతో ఒలింపిక్స్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లోకి ప్రవేశించింది. ఒలింపిక్స్‌కు ముందు జరిగిన సీజన్ మీట్‌లో 12.78 సెకన్ల అత్యుత్తమ టైమింగ్‌తో రేస్‌ను పూర్తిచేసిన జ్యోతి...బుధవారం జరిగే తొలి రౌండ్ హీట్స్‌లో బలమైన ప్రత్యర్థులతో పోటీపడబోతున్నది.

విశాఖకు గర్వకారణం

అత్యంత సాధారణ కుటుంబం నుంచి అథ్లెట్‌గా కెరీర్ ప్రారంభించిన జ్యోతి నేడు ఒలింపిక్స్‌లో పాల్గొననుండడం విశేషం. ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోయినా అంకితభావం, పట్టుదల, క్రమశిక్షణతో సాధన కొనసాగించింది. అనతికాలంలోనే 100 మీటర్ల హర్డిల్స్‌లో టాప్ అథ్లెట్‌గా ఎదిగింది. అంతర్జాతీయ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో తాను ప్రాతినిధ్యం వహించిన ప్రతి మీట్‌లో దేశానికి పతకాలు అందించింది. భారత అథ్లెటిక్స్ రంగంలో అత్యంత వేగవంతమైన హర్డిలర్‌గా ప్రతిష్టాత్మక ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించే స్థాయికి చేరిన ఎర్రాజీ జ్యోతి విశాఖ వాసి కావడం నగరవాసులందరికీ గర్వకారణం.

హర్డిల్స్ షెడ్యూల్

100 మీటర్ల హర్డిల్స్ ఈవెంట్ బుధవారం మొదటి రౌండ్ హీట్స్‌తో ప్రారంభమైంది. గురువారం రిపిచేజ్ రౌండ్, శుక్రవారం (9న) సెమీ ఫైనల్స్, శనివారం (10న) ఫైనల్ రేస్ జరుగుతుంది.

ఫైనల్స్‌కు చేరే అవకాశాలు ఉన్నాయి

అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి నారాయణరావు



ఆమెకు ఒలింపిక్స్‌లో పతకం సాధించే సత్తా ఉంది. ఆసియా క్రీడల్లో పతకం సాధించిన నేపథ్యంలో ఆమెపై అంచనాలు పెరిగాయి. నెలకొల్పిన జాతీయ రికార్డులు, సాధించిన అంతర్జాతీయ పతకాలు ఆమెలో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. పారిస్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో బుధవారం జరిగే తొలి రౌండ్ హీట్స్‌లో క్వాలిఫై అవుతుందనే నమ్మకం ఉంది. అలాగే ఫైనల్స్‌కు చేరే అవకాశాలున్నాయి.

'పేట' మెయిన్‌రోడ్డు ఆక్రమణదారులకు నోటీసులు

▸ ఈవోపీఆర్డీ సీహెచ్ చంద్రశేఖర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పాయకరావుపేట, ఆగస్టు 6: పాయకరావుపేట మెయిన్‌రోడ్డును ఆక్రమించినవారికి నోటీసులు జారీ చేయనున్నామని ఈవోపీఆర్డీ సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. 'పేట'లో ఆక్రమణలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల ప్రచురితమైన కథనంపై స్పందించిన డీపీవో శిరీషారాణి వెంటనే చర్యలు తీసుకోవాలని పాయకరావుపేట పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట మెయిన్‌రోడ్డును ఆక్రమించి ఏర్పాటుచేసిన దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పాయకరావుపేట మెయిన్‌రోడ్డును ఆక్రమించి ఏర్పాటుచేసిన దుకాణాలు, ఇతర ఆక్రమ కట్టడాలను గుర్తిస్తున్నామన్నారు. వీరందరికీ త్వరలో నోటీసులు జారీచేయనున్నామని, ఆక్రమణలు తొలగించకుంటే జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ గుమస్తా వరహాలు తదితరులున్నారు.



ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట షాపులను పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ సీహెచ్ చంద్రశేఖర్

500 హెక్టార్లలో టేకు సాగు

▸ అటవీ శాఖ సీసీఎఫ్ శ్రీకంఠనాథ్ రెడ్డి

గొలుగొండ, ఆగస్టు 6: ఈ ఏడాది ఐదు వందల హెక్టార్లలో టేకు ప్లాంటేషన్లు సాగు చేపట్టామని విశాఖపట్నం అటవీ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ (సీసీఎఫ్) శ్రీకంఠనాథ్ రెడ్డి అన్నారు. మండలంలోని పాతమల్లంపేట శివారు అచ్చియ్యపేటలో టేకు ప్లాంటేషన్‌తోపాటు ధారమఠం ఫారెస్ట్, గొలుగొండలో టేకు కలప డిపోలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ఏడాది 611 హెక్టార్లలో టేకు ప్లాంటేషన్లు ఏర్పాటు చేసేందుకు లక్ష్యం కాగా 500 హెక్టార్లలో టేకు ప్లాంటేషన్లు ఏర్పాటు చేశామన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.8.23 కోట్ల ఆదాయం టేకు కలప వేలం పాటల ద్వారా ప్రభుత్వానికి వచ్చిందన్నారు. సీపీజ్ ద్వారా రూ.80లక్షల ఆదాయం వచ్చిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికి గొలుగొండ, కాకారపాడు, చిలకలగెడ్డ డిపోల్లో టేకు వేలం పాటల ద్వారా రూ.రెండు కోట్లు ఆదాయం ప్రభుత్వానికి సమకూరినట్టు శ్రీకంఠనాథ్ రెడ్డి తెలిపారు. కరక, పప్పుశెట్టిపాలెం, సాలికమల్లవరం ఫారెస్ట్ భూముల్లో గల రంగురాళ్ల క్వారీల వద్ద అక్రమ తవ్వకాల నియంత్రణకు నిరంతరం పెట్రోలింగ్‌తోపాటు, సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. సీసీఎఫ్ వెంట నర్సీపట్నం డీఎఫ్‌వో జగన్నాథ్‌సింగ్, సబ్‌డీఎఫ్‌వో సునీల్‌కుమార్, ట్రైనీ డీఎఫ్‌వో అబ్దుల్‌రవూఫ్, కృష్ణాదేవిపేట రేంజర్ వెంకటరమణ, పి. లక్ష్మినర్సు, గొలుగొండ సెక్షన్ ఆఫీసర్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



గొలుగొండ కలప డిపోలో టేకును పరిశీలిస్తున్న సీసీఎఫ్ శ్రీకంఠనాథ్ రెడ్డి

తాండవ కాలువల మరమ్మతులకు ప్రతిపాదనలు

▸ డీఈఈ అనురాధ

నాతవరం, ఆగస్టు 6 : తాండవ కుడి,ఎడమ కాలువల మరమ్మతులు, మెయిన్ గేట్లు లీకేజీలు, తదితర పనుల కోసం కోటి 80 లక్షల రూపాయలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు తాండవ రిజర్వాయర్ డీఈఈ అనురాధ తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి గాంధీనగరం వద్ద తాండవ ఎడమ కాలువ వెల్ సైఫాన్ వద్ద సాగునీటి లీకేజీని పరిశీలించారు. అలాగే అండర్ టన్నెల్ దగ్గర నీటి వృథా కాకుండా వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ఆగస్టు మూడో వారంలో తాండవ నీరు విడుదల చేసినప్పుడు చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందేలా యుద్ధప్రాతిపదిక పనులు చేస్తున్నట్టు డీఈఈ అనురాధ చెప్పారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరక సత్యనారాయణ మాట్లాడుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తాండవ కాలువల తక్షణ మరమ్మతులకు రూ.ఐదు లక్షలు మంజూరు చేయనున్నట్టు చెప్పారు. అధికారులు అలసత్వం వహించకుండా దగ్గరుండి తక్షణ మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోళెం రామ్‌ప్రసాద్, స్వామి, పోలుపర్తి సాయి, అంకంరెడ్డి వరహాలదొర, అప్పారావు, తాండవ ఏఈ శ్యామ్ పాల్గొన్నారు.



గాంధీనగరం వద్ద తాండవ ఎడమ కాలువ వెల్ సైఫాన్‌ను పరిశీలిస్తున్న డీఈఈ అనురాధ, టీడీపీ నాయకులు

సింహాచలం ఘాట్‌రోడ్డులో వ్యూ పాయింట్

ఆహ్లాదం పంచేలా నిర్మాణానికి శ్రీకారం

సింహాచలం, ఆగస్టు 6: సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మికతతోపాటు ఆహ్లాదాన్ని పంచే దిశగా సింహగిరి ఘాట్‌రోడ్డులో వ్యూ పాయింట్ రూపుదిద్దుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రసాద్ పథకంలో భాగంగా మంజూరైన రూ.54.4 కోట్ల నిధులతో దేవస్థానం పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా పాత, కొత్త ఘాట్‌రోడ్లు కలిసే వై జంక్షన్‌లో సుమారు రూ.20 లక్షలు వెచ్చించి పర్యాటకశాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ రమణ సారథ్యంలో వ్యూ పాయింట్ నిర్మాణం చేపడుతున్నారు. భక్తులు ఎండా, వానల్లో సేద దీరేందుకు అనుకూలంగా పైకప్పు, చుట్టూ ఎటుచూసినా ఆహ్లాదకరంగా పచ్చదనం కనిపించేలా అధికారులు పనులు చేపడుతున్నారు. ప్రస్తుతానికి నిర్మాణం దాదాపు 70 శాతానికి పైగా పూర్తయింది. మరో సుమారు రూ.20లక్షల వ్యయంతో సింహగిరి మెట్లమార్గంలోనూ భక్తులు సేదదీరేందుకు అనుకూలంగా రెస్టింగ్ పాయింట్ పేరుతో నిర్మాణాన్ని త్వరలోనే ప్రసాద్ పథకంలో భాగంగానే చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు ఈఈ రమణ తెలిపారు. ఇందులో భక్తులు కూర్చునేందుకు వీలుగా వసతి, మరుగుదొడ్లు ఏర్పాట్లు చేయనున్నట్టు ఆయన వివరించారు.



నిర్మాణానంతరం ఇలా ఉంటుంది (ఊహాచిత్రం)

అనుమతుల్లేని ఆస్పత్రులపై చర్యలేవీ?

▸ వైద్య ఆరోగ్యశాఖాధికారుల తీరుపై విమర్శలు

అచ్యుతాపురం, ఆగస్టు 6: అచ్యుతాపురంలో అనుమతుల్లేని ఆస్పత్రులు అధిక సంఖ్యలో ఉన్నా వైద్య ఆరోగ్యశాఖాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇక్కడి ప్రైవేటు ఆస్పత్రుల్లో చాలా వరకు ఇండియన్ మెడికల్ కౌన్సిల్ గుర్తింపు లేని వైద్యులు పని చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నర్సింగ్ సిబ్బంది కూడా ఎటువంటి అర్హత లేనివారే పనిచేస్తున్నారని తెలిసింది. దీనివల్ల రోగులకు పక్కాగా వైద్య సేవలు అందవని పలువురు అంటున్నారు. ఇటువంటి వైద్యుల వల్ల రోగుల ప్రాణాలకు ప్రమాదమని పలువురు హెచ్చరిస్తున్నారు. దీనిపై ఇప్పటికైనా వైద్య ఆరోగ్యశాఖాధికారులు స్పందించి ఆస్పత్రులను తనిఖీ చేయాలని పలువురు కోరుతున్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

▸ స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు వినతి



స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు వినతిపత్రం అందజేస్తున్న అంబేడ్కర్ గురుకుల ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

నర్సీపట్నం, ఆగస్టు 6: బాయ్స్ హాస్టల్స్‌లో పురుషులు, గర్ల్స్ హాస్టల్స్‌లో మహిళా ఉద్యోగులు మాత్రమే పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నర్సీపట్నం అంబేడ్కర్ గురుకుల ఉద్యోగులు జీవీ భాస్కరరావు, ఎం ఉమాదేవి కోరారు. ఈ మేరకు మంగళవారం స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని గురుకుల పాఠశాలలో పురుషులు, మహిళలు కలిపి 80 మంది పొరుగు సేవలో పని చేస్తున్నామని తెలిపారు. బాలికల వసతి గృహాల్లో మహిళలు, బాలుర వసతి గృహాల్లో పురుషులు ఉద్యోగం చేయాలని నిబంధన పెట్టడం వల్ల 34 మంది ఉద్యోగులు ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. ఇక్కడ ఉపాధి కోల్పోతున్న ఉద్యోగులను పక్క జిల్లాల్లో సర్దుబాటు చేస్తామని అంటున్నారని, తక్కువ జీతంలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆర్థిక భారం తప్పదని అన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఉపాధి కోల్పోతున్న వారికి స్థానికంగా ఏదైనా ప్రభుత్వ కార్యాలయాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు.

108లో గర్భిణి ప్రసవం

▸ తల్లీబిడ్డ క్షేమం



108 అంబులెన్స్‌లో ప్రసవించిన బిడ్డ

నాతవరం, ఆగస్టు 6: మండలంలో 108 అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవించింది. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు సంతోషపడుతున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వల్సంపేట శివారు ఊటమళ్ల గిరిజన గ్రామంలో సౌమ్యశ్రీ అనే గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో ఆశ కార్యకర్త లక్ష్మి 108 అంబులెన్స్‌లో నాతవరం పీహెచ్‌సీకి తరలిస్తున్నారు. మార్గమధ్యంలో సౌమ్యశ్రీకు నొప్పులు అధికంగా కావడంతో వాహనానికి రోడ్డు పక్కన ఆపి ఆశ కార్యకర్త సాయంతో 108 ఈఎంటీ ఎన్.ప్రసాద్, పైలట్ ప్రసాద్ డెలివరీ చేయించారు. అనంతరం తల్లీబిడ్డలను నాతవరం పీహెచ్‌సీకి తరలించారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు సంతోషపడ్డారు.

కల్యాణపులోవ నీరు విడుదల



కల్యాణపులోవ రిజర్వాయర్ నీటిని విడుదల చేస్తున్న ఇరిగేషన్ ఈఈ స్వామినాయుడు, రైతులు

రావికమతం, ఆగస్టు 6: ఖరీఫ్ సాగుకు కల్యాణపులోవ ఆయకట్టు చివరి భూములకు సాగు నీరు అందించాలని ఇరిగేషన్ ఈఈ జె.స్వామి నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం కల్యాణపులోవ రిజర్వాయర్ వద్ద పూజలు చేసిన అనంతరం ఈఈ స్వామినాయుడు, రైతులు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ, ఈ ఏడాది రిజర్వాయర్‌లో నీరు సమృద్ధిగా ఉన్నప్పటికీ ఆయకట్టు దిగువ ప్రాంతంలో వర్షాలు ఆశించిన స్థాయిలో పడలేదన్నారు. రిజర్వాయర్ 460 అడుగుల సామర్థ్యం కాగా ప్రస్తుతం 459 అడుగుల మేర నీటినిల్వలు ఉన్నాయన్నారు. తొమ్మిది పంచాయతీల పరిధిలో 15 గ్రామాలకు చెందిన 44,780 ఎకరాల ఆయకట్టు భూములకు సాగు నీరు అందించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో జేఈఈ సత్యనారాయణదొర రైతులు పాల్గొన్నారు.

ట్రాలర్ ట్రక్‌పై పాత విమానం



ట్రాలర్ ట్రక్‌పై పాత విమానాన్ని తరలిస్తున్న దృశ్యం

నక్కపల్లి, ఆగస్టు 6: నక్కపల్లి హైవేపై ఓ ట్రాలర్‌పై పాత విమానాన్ని తరలించడాన్ని అందరూ ఆసక్తిగా తిలకించారు. మంగళవారం కోల్‌కతా నుంచి చెన్నైకి ట్రాలర్ ట్రక్‌పై పాత విమానాన్ని తీసుకువెళుతుండగా, కొందరు ఫొటోలు తీసుకున్నారు. వినియోగంలో లేని ఈ పాత విమానానికి మరిన్ని హంగులు దిద్ది, హోటల్‌గా తయారుచేస్తారని ట్రక్‌లో ఉన్న వ్యక్తి చెప్పాడు.

పెద్ద రాంభద్రాపురం హైస్కూలులో క్రీడా పోటీలు



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 6 : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పెదరాంభద్రపురం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం కోడి శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు షేక్ రహమాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు ప్రారంభించారు. మంగళవారం బాలికల సీనియర్స్, బాలుర సీనియర్స్‌కు కబడ్డీ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవంబరు 29, 30న అంతర్జాతీయ సెమినార్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఎలమంచిలి, ఆగస్టు 6 : స్థానిక శ్రీగురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలల్లో జియోకేర్ ఫౌండేషన్ (ఢిల్లీ) సహాయంతో నవంబరు 29, 30 తేదీల్లో సైన్స్ సాహిత్యం ప్రభావం, ప్రేరణ అనే అంశంపై అంతర్జాయ సెమినార్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ సెమినార్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహిత్యంపై సైన్స్ ప్రభావం, సైన్స్‌పై సాహిత్య ప్రభావం, సాహిత్యంలో శాస్త్రీయ ఆలోచనలు, వైజ్ఞానిక పరిశోధన ఆవిష్కరణలపై సాహిత్య ప్రభావం, పర్యావరణ సాహిత్యం అనే అంశాలపై చర్చలు జరుగుతాయన్నారు. ఆశక్తి గలవారు 8309739377, 9100443611 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ కె.శివయ్య, తెలుగు విభాగాధిపతి వీఏ సత్యనారాయణ, ఇంగ్లీష్ విభాగాధిపతి కె.ప్రేమ్‌సాగర్, కార్యక్రమం కో-కన్వీనర్ డాక్టర్ సుజాత, తెలుగు అధ్యాపక సిబ్బంది, విద్యార్థులుపాల్గొన్నారు.

దుర్బుద్ధితోనే 'కూటమి' పోటీ : బొత్స


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి బొత్స

ఎస్.రాయవరం, ఆగస్టు 6 : కొద్ది రోజుల్లో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మొత్తం 858 ఓట్లకు వైసీపీకి 620 పైగా ఓట్లు ఉన్నప్పటికీ సుమారు 250 ఓట్లు మాత్రమే ఓట్లు ఉన్న కూటమి ప్రభుత్వం దుర్బుద్ధితో పోటీకి సిద్ధపడుతోందని మాజీ మంత్రి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ విమర్శించారు. మండలంలోని అడ్డరోడ్డులో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన జడ్పీటీసీలు, ఎంపీటీసీలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో బొత్స సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రలోభాలకు ఎవరూ లొంగ వద్దన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యేలు కంబాల జోగులు, కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, వైసీపీ మండలాల అధ్యక్షులు బొలిశెల్లి గోవిందరావు, శీరం నరసింహమూర్తి, చిక్కాల రామారావు, సీనియర్ నాయకులు వీసం రామకృష్ణ, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై దళిత సంఘాల నిరసన


నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నేతలు

అచ్యుతాపురం, ఆగస్టు 6 : వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ అచ్యుతాపురం మండలం దళిత సంఘాలు ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నేతలు మాట్లాడుతూ ఈ తీర్పు దళిత వర్గాలని ముఖ్యంగా మాల, మాల ఉపకులాలను అణిచివేసే విధంగా ఉందన్నారు. ఈ తీర్పు రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో తట్టా పెంటయ్య నాయుడు, రేబాక మధు, బోని గణేష్, మైలపల్లి రాహుల్, కార్ల సాయి సుందర్, బీలా గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యా కమిటీలకు సమర్థులనే ఎన్నుకోండి

టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్


విద్యాకమిటీ ఎన్నికలపై సూచనలు ఇస్తున్న వెంకటేష్

నక్కపల్లి, ఆగస్టు 6 : విద్యా కమిటీల ఎన్నికల్లో పాఠశాలల అభివృద్ధికి చిత్తశుద్ధితో పాటుపడే వారిని ఎన్నుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ సూచించారు. మండలంలోని గొడిచెర్ల హైస్కూల్ పరిధిలో వున్న పలు గ్రామాల టీడీపీ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ హోంమంత్రి అనిత నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలకు రూపకల్పన చేస్తున్నారని చెప్పారు. అందుచేత పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దే కమిటీలను ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వైబోయిన రమణ,నానేపల్లి రాముడు, దార్ల నాగరాజు, దార్ల కృష్ణ, మారిశెట్టి నానాజీ, కరణం సూరిబాబు, జి.రమేశ్ పలువురు పాల్గొన్నారు.

విద్యారంగంలో సమస్యలపై దృష్టి సారించాలి : యూటీఎఫ్


వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

అచ్యుతాపురం, ఆగస్టు 6 : పాఠశాల విద్యారంగంలో నెలకొన్న సమస్యలు సత్వరమే పరిష్కరించాలంటూ యూటీఎఫ్ నాయకులు మంగళ వారం ఎంపీడీవో సురేశ్‌కుమార్, ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నేతలు మాట్లాడుతూ రాష్ట్ర విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లి తండ్రులకు విశ్వాసం సడలిపోతోందని, ఫలితంగా ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితులు విషమించక ముందే ప్రభుత్వం మేల్కొని పరిస్థితులు చక్కదిద్దాలని వీరు కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.నానాజీ, సుభాషిణీ దేవి, ఎం.సూర్యలక్ష్మి, మహిమారావు తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూముల విచారణపై మీనమేషాలు

... 5వ పేజీ తరువాయి

స్థలానికి ఆక్రమణదారులు నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించారు. ఓ వ్యక్తి పేరుతో రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. మరో సర్వే నంబరు 71/2లో 45 సెంట్ల భూమిని నకిలీ వన్‌బీ సృష్టించి మరో వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయించారు. మొత్తం వ్యవహారంపై ఎన్ఆర్ఐ బంధువు శ్రీమంతుల నవీన్‌కుమార్ రాంబిల్లి పోలీసులకు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. పంచదార్ల రెవెన్యూలో భూ కబ్జాల వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురించింది. అయినా స్థానిక రెవెన్యూ అధికారులు, ప్రస్తుత ఇన్‌చార్జి తహసీల్దార్ డీటీ శేషు కనీసం ఫిర్యాదుపై స్పందించలేదు. విచారణ కూడా జరపలేదు. దీంతో బాధితుడు నవీన్‌కుమార్ తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ఆశ్రయించారు. పంచదార్ల వివాదాస్పద భూములపై ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు మంగవారం స్టేటస్‌కో (యథాస్థితి) ఉత్తర్వులు జారీ చేసింది. భూ ఆక్రమణదారులకు, సంబంధిత రెవెన్యూ అధికారులకు మంగళవారం కోర్టు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 12న వారిని ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు హాజరు కావాలని ఆదేశించారు.

ప్రజా సంక్షేమమే కూటమి ధ్యేయం

» ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు

రాంబిల్లి, ఆగస్టు 6 : ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన చేస్తుందని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని హరిపురంలో గల జనసేన పార్టీ కార్యాలయంలో ఎలమంచిలి నియోజకవర్గం కూటమి నేతల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీలు ఐక్యంగా పని చేయడం వల్ల మరింత మేలు జరుగుతుందన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. నేతలు నిత్యం గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారాన్ని తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎలమంచిలి నియోజకవర్గం కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు, టీడీపీ రాష్ట్ర నాయకులు ధూళి రంగనాయకులు, రాజాన రమేష్ కుమార్, నియోజకవర్గం నేతలు జనపరెడ్డి శ్రీనివాసరావు, బైలపూడి శ్రీరామదాసు, పప్పల నూకన్నదొర, వి.దిన్‌బాబు, నర్సింగరావు, డి.శ్రీను, బాపునాయుడు, సాయిరామ్, నియోజకవర్గం మూడు పార్టీల నేతలు పాల్గొన్నారు.

రాత్రి వేళల్లో విధులు వద్దు

ఆర్డీవో కార్యాలయం ఎదుట వీఆర్ఏల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న వీఆర్ఏలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 6 : వీఆర్ఏలకు వాచ్‌మెన్ డ్యూటీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట వీఆర్ఏలు ధర్నా చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా రెవెన్యూ కార్యాలయాల వద్ద వేసిన రాత్రి డ్యూటీలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో వీఆర్ఏలు రెవెన్యూకు సంబంధించిన ప్రభుత్వ పనులు నిర్వహిస్తారని అటువంటిది వాచ్‌మెన్ డ్యూటీలు వేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చిందని పేర్కొన్నారు. వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకుండా, కనీస వేతనాలు అమలు చేయడం లేదని సంఘ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో వీఆర్ఏలకు పదోన్నతులు ఇవ్వలేదని అనేక మంది అర్హత ఉంది అటెండర్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా, డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తున్నారని ఖాళీలను వెంటనే భర్తీ చేసి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కె. రవికుమార్, ఎన్.గంగాధరరావు, శాంతి, నాగేశ్వరరావు, కుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయాలి


ఎమ్మెల్యే కొణతాలకు వినతిపత్రం అందజేస్తున్న భద్రం

తుమ్మపాల, ఆగస్టు 6 : అనకాపల్లిలో ఇసుక స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వైఎన్ భద్రం కోరారు. మంగళవారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు ఏఐటీయూసీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భద్రం మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో నూతన గృహాలు నిర్మించుకునే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సిమెంట్, ఇనుము, ఇటుకతో పాటు ఇసుక అందుబాటులో లేక తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. భవన నిర్మాణ కార్మికుల సైతం పనులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు.

జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఆకతాయిల వీరంగం


ఇంటి ముందు చెత్త పాడైన ఏసీ అవుటర్

పరవాడ, ఆగస్టు 6 : గొర్లివానిపాలెం పంచాయతీ పరిధి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో సోమవారం రాత్రి ఆకతాయిలు వీరంగం సృష్టించారు. అక్కడే నివాసముంటున్న ఒకరి ఇంటి ముందు చెత్తను పడేయడంతో పాటు అదే ఇంటికి చెందిన ఏసీ ఫ్యాన్ బాక్సును ధ్వంసం చేశారు. దీంతో బాధిత కుటుంబం పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తిప్పాని శ్రీనివాసరావు తన కుటుంబసభ్యులతో కలిసి జేఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలో నివాసం ఉంటున్నారు. సోమవారం సాయంత్రం కొంతమంది ఆకతాయిలు శ్రీనివాసరావు ఇంటి సమీపంలో వాలీబాల్ ఆడారు. ఈ క్రమంలో బంతి శ్రీనివాసరావు ఇంటిల్లోకి వెళ్లి పడింది. వెంటనే శ్రీనివాసరావు భార్య ఇళ్ల మధ్య ఆటలు ఏమిటంటూ ప్రశ్నించింది. దీంతో కోపోద్రిక్తులైన యువకులు నీ సంగతి తెలుస్తామంటూ ఆమెను హెచ్చరించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

మంగళవారం ఉదయం శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు నిద్ర లేచే సమయానికి ఇంటి ముందు పెద్ద ఎత్తున చెత్త పడేసి ఉంది. అలాగే ఇంటికి చెందిన ఏసీ ఫ్యాన్ బాక్సును ధ్వంసం చేశారు. శ్రీనివాసరావు భార్య ప్రశ్నించారన్న కారణంతో సోమవారం రాత్రి 11 గంటల సమయంలో వీధి దీపాలను ఆపేసి ఆకతాయిలు ఈ చర్యలకు పాల్పడినట్లు తెలుస్తుంది. శ్రీనివాసరావు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆకతాయిల్లో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాలనీలో గత కొన్ని రోజులుగా ఆకతాయిల ఆగడాలు పెచ్చుమీరిపోతున్నాయని కాలనీవాసులు చెబుతున్నారు. పోలీసులు దృష్టి సారించి ఆకతాయిల ఆగడాలకు కళ్లెం వేయాలని కోరుతున్నారు.

కనకారావు సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే కొణతాల


కనకారావు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

అనకాపల్లి టౌన్, ఆగస్టు 6 : రెవెన్యూ శాఖలో తహసీల్దార్‌గా పదవీవిరమణ చేసిన పి.కనకారావు సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. గత నెల 31న ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారిగా పదవీ విరమణ చేసిన సందర్భంగా సోమవారం రాత్రి స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశమందిరంలో కనకారావుకు సత్కరించారు. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ కనకారావు బాధ్యతతో వ్యవహరించేవారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కనకారావు దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు చెందిన పలువురు ఉద్యోగులు పాల్గొని కనకారావును సత్కరించారు.

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన సదస్సు

కశింకోట, ఆగస్టు 6 : మండలంలోని బయ్యవరం ప్రాథమిక పాఠశాలలో ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్లాక్ సాల్ట్, బ్లాక్ టీ, పొగాకు, బోర్ వెల్ నీటిని వాడటం వల్ల వ్యాధి బారిన పడతారని హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం చంద్రమ్మ పాల్గొని మాట్లాడారు.

పైడమ్మ చెరువు సమస్య పరిష్కరించండి

ఆర్డీవో చిన్నికృష్ణకు వాడనర్సాపురం వాసుల వినతి


ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాంబిల్లి, ఆగస్టు 6 : నేవీ నిర్వాసిత మత్స్యకార గ్రామమైన వాడనర్సాపురంలో పైడమ్మ చెరువు సమస్యను పరిష్కరించాలని గ్రామ సర్పంచ్ కారే రామారావు, మాజీ సర్పంచ్ చింతకాయల ఎర్రయ్యలు గ్రామపెద్దలతో కలిసి మంగళవారం అనకాపల్లి ఆర్డీవోచిన్నికృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ గ్రామాన్ని ఆనుకొని ఉన్న 287-1ఎ1లో 134 ఎకరాలు విస్తీర్ణంలో పైడమ్మ చెరువు ఉందన్నారు. పూర్వం నుంచి ఈ చెరువుతో సంప్రదాయ పద్ధతిలో చేపలు పట్టుకుంటున్నామని, ఇతర గ్రామల పశుపక్ష్యాదులకు సైతం ఈ చెరువు వద్ద సేద తీరుతుంటాయని తెలిపారు. సాగునీరు అందిస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో కొందరు రైతులు ఈ చెరువులో కొంత భాగాన్ని ప్రొసీడింగ్స్ డిపట్టాలు పొందారన్నారు. ఈ చెరువు తమ గ్రామానికి చెందాలని ధర్నాలు చేపట్టామన్నారు. తాజాగా ఈ చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేస్తామంటూ నేవీ వారు చెబుతున్నట్టు తెలిసిందన్నారు. ఇలా జరగనీయకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు వాడనర్సాపురం వాసులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొవిరి సోమేష్, కారేరాముడు, కో-ఆప్షన్ సభ్యులు పెంటయ్య, ఎస్.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో 'పొలంబడి'

కొత్తూరు, ఆగస్టు 6 : మండలంలోని సీతానగరంలో మంగళవారం పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి మండల వ్యవసాయాధికారి రంగాచారి మాట్లాడుతూ.. జీవన ఎరువులను ఏ విధంగా పొలంలో ఉపయోగించాలో రైతులకు వివరించారు. వరినాట్లు నాటిన తరువాత ప్రతి రెండు మీటర్లకు ఒక అడుగు చొప్పున కాలిబాటలు ఏర్పరచుకోవడం ద్వారా గాలి ప్రసరణ సూర్యరశ్మి అధికంగా జరిగి చీడపీడలు ఆశించడం తక్కువగా ఉంటుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జ్యోతిమోహన్, రైతులు తెల్లాకుల ప్రకాష్, పొలమరశెట్టి గోవిందరాజులు, గంగుపాం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి పీలా గోవింద

... 5వ పేజీ తరువాయి

ఖరారు చేసినట్టు తెలిసింది.

టీడీపీ కార్యాలయానికి ఏజెన్సీ వైసీపీ ప్రజాప్రతినిధులు

ఏజెన్సీలో వైసీపీకి చెందిన పలువురు ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు మంగళవారం విశాఖపట్నంలోని టీడీపీ కార్యాలయానికి వచ్చారు. తాము పార్టీ మారుతామని, తమ గ్రామాల అభివృద్ధికి సహకరించాలని టీడీపీ నాయకులను కోరారు. అదేవిధంగా మరికొంత మంది నాయకులు బుధవారం వస్తారని సమాచారం.

వైసీపీ హయాంలో స్థానిక సంస్థలు నిర్వీర్యం

వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసింది. వారికి రావలసిన నిధులను దారిమళ్లించింది. దాంతో ఆ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు కూడా అధినాయకత్వంపై గుర్రుగా ఉన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థలకు పూర్వ అధికారాలు కట్టబెట్టడంతో పాటు 'నీరు-చెట్టు' పథకం కింద నిధులు పంపిణీ చేయడానికి చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో వైసీపీకి చెందిన జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు ఆయా నిధులతో తమ ప్రాంతాలను అభివృద్ధి చేసుకోవడానికి కూటమితో కలసి నడవడానికి ఆసక్తి చూపుతున్నారు. అలా స్వచ్ఛందంగా ముందుకువచ్చే వారిని పార్టీలో చేర్చుకునేందుకు కూటమి నాయకత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు బుధవారం నుంచి పార్టీలో చేరికలు ప్రారంభమవుతాయని టీడీపీ నేతల ద్వారా తెలిసింది. ప్రస్తుతం కూటమి చేతిలో 250 ఓట్లు ఉన్నాయని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవాలంటే 486 ఓట్లు రావాలని చెబుతున్నారు. ఈ ఎమ్మెల్సీ స్థానాన్ని కచ్చితంగా కూటమే గెలుచుకుంటుందని70 ఓట్ల మెజారిటీ కూడా సాధిస్తుందని ఆ పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

కాగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మొత్తం 838 మంది ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం వైసీపీకి 615, కూటమికి 218 ఓట్లు ఉన్నాయి. ఏజెన్సీలో వామపక్షాలకు 18 ఓట్లు ఉన్నాయి. వారు కూటమితో చెలిమికి అంగీకరించారు.

మహా ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

ఆధ్వర్యంలోనే జరిగిపోతాయి కాబట్టి దానికి ఎనలేని ప్రాధాన్యం ఉంటుంది. ఏడాదిపాటు పదవిలో ఉండే స్టాండింగ్ కమిటీలో పది మంది సభ్యులకు అవకాశం ఉంది. వీరందరినీ జీవీఎంసీ పరిధిలోని కార్పొరేటర్లు రహస్య ఓటింగ్ పద్ధతిలో ఎన్నుకోవాల్సి ఉంటుంది. కూటమి నుంచి నొల్లి నూకరత్న (19వ వార్డు), గల్లా పోలిపల్లి (63వ వార్డు), శరగడం రాజశేఖర్ (56వ వార్డు), బొమ్మిడి రమణ (90వ వార్డు), గొలగాని వీరారావు (27వ వార్డు), పిసిని వరహానరసింహం (98వ వార్డు), పులి లక్ష్మీబాయి (75వ వార్డు), బల్ల శ్రీనివాసరావు (94వ వార్డు), పిళ్లా మంగమ్మ (ఏడో వార్డు)తోపాటు ఇండిపెండెంట్‌గా గెలిచి ఇటీవల టీడీపీలో చేరిన విల్లూరి భాస్కరరావు (35వ వార్డు) పోటీలో ఉన్నారు. వైసీపీ నుంచి అక్కరమాని రోహిణి (12వ వార్డు), రెయ్యి వెంకటరమణ (51వ వార్డు), మహ్మద్ ఇమ్రాన్ (66వ వార్డు), బిపిన్‌కుమార్ జైన్ (31వ వార్డు), ముర్రువాణి (57వ వార్డు), సాడి పద్మారెడ్డి (24వ వార్డు), నక్కెళ్ల లక్ష్మి (20వ వార్డు), తోట పద్మావతి (34వ వార్డు), కరజాడ వెంకటనాగ శశికళ (55వ వార్డు), పల్లా అప్పలకొండ (28వ వార్డు) పోటీలో ఉన్నారు. జీవీఎంసీలో ప్రస్తుతం 97 మంది కార్పొరేటర్లు ఉన్నప్పటికీ, సీపీఎం కార్పొరేటర్ గంగారావు ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నట్టు ప్రకటించడంతో 96 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకుంటారు. దీని ప్రకారం ఎన్నికల్లో గెలవాలంటే ఒక్కో అభ్యర్థి కనీసం 49 ఓట్లు దక్కించుకోవాలి. కాగా ప్రస్తుతం కూటమిలో ఉన్న టీడీపీకి 36 మంది కార్పొరేటర్లు, జనసేనకు పది మంది కార్పొరేటర్లు, బీజేపీ నుంచి ఒకరు మొత్తం 47 మంది సభ్యుల బలం ఉంది. వీరితోపాటు సీపీఐ కార్పొరేటర్ ఏజే స్టాలిన్ కూటమికి మద్దతుగా ఓటేయాలని నిర్ణయించారు. ఇండిపెండెంట్ కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య కూడా కూటమికి మద్దతు ప్రకటించారు. దీంతో కూటమి బలం 49కి పెరిగింది. మరో నలుగురైదుగురు బుధవారం పార్టీలో చేరి నేరుగా పోలింగ్ కేంద్రానికి వస్తారని టీడీపీ నేతలు చెబుతున్నారు. అదే జరిగితే కూటమి అభ్యర్థుల విజయం నల్లేరు మీద నడకే అవుతుందనడంలో సందేహం ఉండదు. మరోవైపు వైసీపీ బలం ప్రస్తుతం 47కి తగ్గిపోయింది. వైసీపీ కార్పొరేటర్లతో నగరంలోని ఒక హోటల్‌లో పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త మంగళవారం సమావేశం ఏర్పాటుచేశారు. వారిలో నలుగురు కార్పొరేటర్లు సమావేశానికి గైర్హాజరయ్యారు. వారు కూటమిలో చేరిపోతారనే ప్రచారం జరుగుతోంది.

ఇరువర్గాల్లోనూ క్రాస్‌ఓటింగ్ గుబులు

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూటమి నేతలతోపాటు వైసీపీ నేతలకు క్రాస్‌ఓటింగ్ భయం వెంటాడుతోంది. ఎన్నికల్లో విజయం సాధించడానికి కావాల్సిన కార్పొరేటర్ల బలాన్ని ప్రస్తుతం కూటమి సంపాదించినప్పటికీ, వైసీపీ నేతలు చేస్తున్న ప్రచారం వారిని ఆందోళనకు గురిచేస్తోంది. కనీసం ఐదుగురు తమ అభ్యర్థుల్లో నలుగురైదుగురికి అనుకూలంగా ఓటేస్తారని వైసీపీ నేతలు ధీమా వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు కూటమి నేతలు కూడా విజయానికి కావాల్సిన బలం తమకు ఉన్నప్పటికీ, వైసీపీలోని మరికొందరు కార్పొరేటర్లు తమ పార్టీల్లో చేరేందుకు ఆసక్తితో ఉన్నందున వారంతా రహస్యంగా తమ అభ్యర్థులకే ఓటేస్తారు కాబట్టి, తాము పది స్థానాలను దక్కించుకుంటామని టీడీపీ నేతలు ధీమా వ్యక్తంచేస్తున్నారు.

☛ సంక్షిప్తంగా..

రైతులు ఆధార్ వివరాలు అందించాలి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 6 : స్థానిక గౌరీ పీఏసీఎస్‌లో సభ్యత్వం ఉన్న రైతులందరూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆధార్‌కార్డు జెరాక్స్, మొబైల్ నంబరును సంఘ కార్యాలయంలో అందించాలని సంఘ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ప్రసాదరావు ఒక ప్రకటనలో కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంఘ సభ్యుల వివరాలను సేకరిస్తున్నట్టు పేర్కొన్నారు.

యోగాతో బహు ప్రయోజనాలు

నక్కపల్లి, ఆగస్టు 6 : యోగా వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని, మానసిక ప్రశాంతత, చక్కటి ఆరోగ్యం, దీర్ఘకాలలిక వ్యాధుల నివారణకు యోగాసనాలు ఎంతో ఉపయోగపడతాయని ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి అన్నారు. మంగళవారం ఉపమాకలో ఉచిత యోగా శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపమాక సర్పంచ్ ప్రగడ వీరబాబు, కొప్పిశెట్టి హరి, నరిశే దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

'కూటమి' ఫైవ్‌మెన్ కమిటీ ఎన్నిక


ఎమ్మెల్యే సుందరపుతో కమిటీ సభ్యులు

ఎలమంచిలి, ఆగస్టు 6 : ఎలమంచిలి మండలం ఎన్‌డీఏ కూటమి ఐదుగురు సభ్యుల కమిటీని మంగళవారం హరిపురం జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రకటించారు. సభ్యులుగా బొద్దపు శ్రీనివాసరావు, గొర్లె శివనారాయణమూర్తి, నక్కా శివశంకర్, కొఠారు శాంబశివరావు, కర్రి ఝాన్సీ లు నియమితులైనారు. వీరికి ఎమ్మెల్యే విజయకుమార్, కూటమి నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.51 వేల విరాళం

సబ్బవరం, ఆగస్టు 6 : మండల కేంద్రంలో శివాలయం నిర్మాణానికి గొటివాడకు చెంది భక్తులు పోతంశెట్టి శేషు మంగళవారం రూ. 51,116 విరాళం అందజేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు దంగేటి నానిబాబు, ప్రకాశ్, బర్ల రమణ, కొల్లి కృష్ణ, కోరాడ శ్రీని అభినందించారు.

బీజేపీ పాలనలో నిరుద్యోగులకు అన్యాయం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 6 : దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏళ్లు గడుస్తున్నా రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలమైందని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ ఆరోపించారు. మంగళవారం సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనకాపల్లి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలను నెలకొల్పి వాటి ద్వారా ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కమిటీ నాయకులు కాళ్ల తేలయ్యబాబు, బి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గొడిచెర్లలో సేవా కార్యక్రమాలు

నక్కపల్లి, ఆగస్టు 6 : మండలంలోని గొడిచెర్లలో మాజీ వైస్ ఎంపీపీ వైబోయిన రమణ జన్మదిన వేడుకల సందర్భంగా టీడీపీ నాయకులు, ఆయన అభిమానులు మంగళవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, పలువురు నేతలు పాల్గొన్నారు.

'పేట' సచివాలయాల తనిఖీ

పాయకరావుపేట, ఆగస్టు 6 : పాయకరావుపేటలోని పలు సచివాలయాలను నర్సీపట్నం డివిజనల్ అభివృద్ధి అధికారి ఉదయశ్రీ మంగళవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. పట్టణంలోని 1,3,4,5 సచివాలయాలను సందర్శించిన డీఎల్‌డీవో రికార్డులు తనిఖీచేశారు. ఈ సందర్భంగా సచివాలయాల ఉద్యోగులకు పలు సలహాలు, సూచనలు చేశారు. సచివాలయాలకు వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఆమె వెంట ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్ తదితరులున్నారు.

'పేట'లో రేపు మెగా వైద్య శిబిరం

పాయకరావుపేట, ఆగస్టు 6 : జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్ బర్త్ డే సందర్భంగా గురువారం పాయకరావుపేటలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పట్టణంలోని ఆయన స్వగృహం వద్ద ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నన్న మెగా వైద్య శిబిరంలో మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు గురు న్యూరో కేర్, హైమా నేత్రాలయం, సాయి భరద్వాజ్ చెస్ట్ హాస్పిటల్, సహస్ర హాస్పటల్ ఆధ్వర్యంలో పలువురు వైద్య నిపుణులు అన్ని రకాల వ్యాధులు, ఆరోగ్య సమస్యలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందని తోట నగేశ్ అభిమానులు తెలిపారు.

సీపీఎం విరాళాల సేకరణ

రాంబిల్లి, ఆగస్టు 6 : కేరళలోని వాయనాడ్ బాధితుల కోసం మంగళవారం సీపీఎం నాయకులు విరాళాలు సేరకణ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ జి. దేముడునాయుడు మాట్లాడుతూ కేరళ వరద బాధితుల సహాయార్థం తమ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో విరాళాలు సేకరిస్తున్నాట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు చందక రామకృష్ణ, ఎం.నారాయణరావు, కె.నూకరత్నం, సీహెచ్ పవన్ కుమార్, యు.బంగార్రాజు, అప్పలరాజు, వెంకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వాలకు స్పందన భేష్


కొడవటిపూడిలో సభ్యత్వాల నమోదు

కోటవురట్ల, ఆగస్టు 6 : మండలంలోని కొడవటిపూడిలో చేపట్టిన జనసేన పార్టీ సభ్యత్వాల నమోదుకు మంచి స్పందన వచ్చినట్టు ఆ పార్టీ నేత బాలేపల్లి ఏసుబాబు తెలిపారు. మంగళవారం జనసేన పార్టీ సభ్యత్వాల నమోదు ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ 425 మంది పార్టీ క్రియాశీల సభ్యత్వాలు నమోదు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

కూటమి ప్రలోభాలకు లొంగవద్దు

▸▸ వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

నర్సీపట్నం, ఆగస్టు 6 : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలలో టీడీపీకి బలం లేకున్నా పోటీ పెట్టడం అప్రజాస్వామికం అని వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ విమర్శించారు. మంగళవారం పెదబొడ్డేపల్లి పార్టీ క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ అధ్యక్షతన నియోజవకవర్గంలోని జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, పురపాలక కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలలో 400 ఓట్ల తేడా ఉన్నా, టీడీపీ తరుపున అభ్యర్థిని పోటీ పెడుతున్నారని, ఇది మంచి సంప్రదాయం కాదన్నారు. ఈ నెల 30న జరిగే శాసన మండలి ఎన్నికలలో ప్రలోభాలకు లొంగకుండా గౌరవాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కారుమూరి సత్యనారాయణ, బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణ రావు, సీనియర్ నాయకులు ఎర్రాపాత్రుడు, సీహెచ్ సన్యాసిపాత్రుడు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రతి పాఠశాల నుంచి 'ఇన్‌స్పైర్'కు మూడు నామినేషన్లు

▸▸ డిప్యూటీ డీఈవో అప్పారావు

నర్సీపట్నం, ఆగస్టు 6 : ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైరిడ్ రిసెర్చ్ (ఇన్‌స్పైర్) కోసం ప్రతి పాఠశాల నుంచి మూడు నుంచి ఐదు నామినేషన్లు నమోదు కావాలని డిప్యూటీ డీఈవో అప్పారావు పేర్కొన్నారు. ఐదు రోడ్ల కూడలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 12 మండలాలలోని 140 మంది సైన్స్ టీచర్లకు ఇన్‌స్పైర్‌కు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో ప్రాజెక్టులు ఎలా తయారు చేయించాలి, తర్వాత నామినేషన్ నమోదు ఎలా చేయాలన్న దానిపై వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈవో మాట్లాడుతూ పిల్లలలో దాగి ఉన్న విజ్ఞానాన్ని జాతీయ స్థాయిలో ప్రతిబింబించడానికి ఇన్‌స్పైర్ వంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని తెలిపారు. జిల్లా స్థాయికి ఎంపికైన ప్రతి ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.10 వేలు నేరుగా విద్యార్థి బ్యాంక్ ఖాతాలో వేస్తుందని తెలిపారు. జిల్లా స్థాయి నుంచి ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర, హెచ్ఎం రత్నం పాల్గొన్నారు.

హామీల అమలుపై దృష్టి సారించాలి

▸▸ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణమూర్తి

నర్సీపట్నం, ఆగస్టు 6 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కృష్ణా ప్యాలస్‌లో జరిగిన సీపీఐ జిల్లా సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 25న సీపీఐ నూరు వసంతాలు జరుపుకుంటుందని, ప్రజల భాగస్వామ్యంతో పోరాట స్ఫూర్తిని మరింత చురుగ్గా ముందుకు తీసుకు వెళ్లాలని అన్నారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి అందరు కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం గత ఐదేళ్లలో రాష్ట్రానికి చేసిందేమి లేదని విమర్శించారు. ఇటీవల పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలలో రాష్ట్రానికి వరద సహాయ నిధులు ప్రకటించామని చెప్పి, అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు అప్పుగా ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలకమైన పోలవరం, విశాఖ రైల్వేజోన్, అమరావతి రాజధాని నిర్మాణం తదితర అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. సీపీఐ అన్ని శాఖలను జిల్లాలో బలోపేతం చేసి నవంబరులో జరిగే ఏఐఎస్ఎఫ్ మహాసభలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, రాజాన దొరబాబు, మాకిరెడ్డి రామునాయుడు, రావు జగ్గారావు, గురుబాబు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న డా.గాయత్రి, ఐసీడీఎస్ సిబ్బంది

కృష్ణాదేవిపేట, ఆగస్టు 6 : తల్లిపాలతోనే పుట్టినబిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని కృష్ణాదేవిపేట వైద్యాధికారి గాయత్రి అన్నారు. అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం ఐసీడీఎస్ అధికారులు, వైద్యాసిబ్బంది ర్యాలీ, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తొలి ఆరు నెలల్లో తల్లి పాలు చాలా ముఖ్యమన్నా రు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎం.సత్యశ్రీ, సత్యవతి, రాఘవ, పంచయతీ కార్యదర్శి కిరణ్మయి, అంగన్‌వాడీ టీచర్లు అచ్చియ్యమ్మ, సత్యవతి, వరలక్ష్మి, దుర్గ, మంగ, భవాని, ధనలక్ష్మి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన అవసరం : ఎంపీడీవో

నాతవరం, ఆగస్టు 6 : స్థానిక మండల పరిషత్ కార్యాలయం నోటీసు బోర్డులో ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ వివరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జె.రాంబాబు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన నియమాలు, వివరాలను జడ్పీటీసీ, ఎంపీటీలు తెలసుకోవాలన్నారు. ఓటు వేసే విధానం గురించి స్థానిక ప్రజాప్రతినిధులు అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో పి.పార్థసారధి, ఈవోపీఆర్డీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూముల విచారణపై మీనమేషాలు

... 5వ పేజీ తరువాయి

స్థలానికి ఆక్రమణదారులు నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించారు. ఓ వ్యక్తి పేరుతో రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. మరో సర్వే నంబరు 71/2లో 45 సెంట్ల భూమిని నకిలీ వన్‌బీ సృష్టించి మరో వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయించారు. మొత్తం వ్యవహారంపై ఎన్ఆర్ఐ బం ధువు శ్రీమంతుల నవీన్‌కుమార్ రాంబిల్లి పోలీసులకు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. పంచదార్ల రెవెన్యూలో భూ కబ్జాల వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురించింది. అయినా స్థానిక రెవెన్యూ అధికారులు, ప్రస్తుత ఇన్‌చార్జి తహసీల్దార్ డీటీ శేషు కనీసం ఫిర్యాదుపై స్పందించలేదు. విచారణ కూడా జరపలేదు. దీంతో బాధితుడు నవీన్‌కుమార్ తమకు న్యాయం చే యాలని కోరుతూ ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ఆశ్రయించారు. పంచదార్ల వివాదాస్పద భూములపై ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు మంగవారం స్టేటస్‌కో (యథాస్థితి) ఉత్తర్వులు జారీచేసింది. భూ ఆక్రమణదారులకు, సంబంధిత రెవెన్యూ అధికారులకు మంగళవారం కోర్టు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 12న వారిని ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు హాజరు కావాలని ఆదేశించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి పీలా గోవింద

... 5వ పేజీ తరువాయి

ఖరారు చేసినట్టు తెలిసింది.

టీడీపీ కార్యాలయానికి ఏజెన్సీ వైసీపీ ప్రజాప్రతినిధులు

ఏజెన్సీలో వైసీపీకి చెందిన పలువురు ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు మంగళవారం విశాఖపట్నంలోని టీడీపీ కార్యాలయానికి వచ్చారు. తాము పార్టీ మారుతామని, తమ గ్రామాల అభివృద్ధికి సహకరించాలని టీడీపీ నాయకులను కోరారు. అదేవిధంగా మరికొంత మంది నేతలు బుధవారం వస్తారని సమాచారం.

వైసీపీ హయాంలో స్థానిక సంస్థలు నిర్వీర్యం

వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసింది. వారికి రావలసిన నిధులను దారిమళ్లించింది. దాంతో ఆ పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు కూడా అధినాయకత్వంపై గుర్రుగా ఉన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థలకు పూర్వ అధికారాలు కట్టబెట్టడంతో పాటు 'నీరు-చెట్టు' పథకం కింద నిధులు పంపిణీ చేయడానికి చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో వైసీపీకి చెందిన జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు ఆయా నిధులతో తమ ప్రాంతాలను అభివృద్ధి చేసుకోవడానికి కూటమితో కలసి నడవడానికి ఆసక్తి చూపుతున్నారు. అలా స్వచ్ఛందంగా ముందుకువచ్చే వారిని పార్టీలో చేర్చుకునేందుకు కూటమి నాయకత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు బుధవారం నుంచి పార్టీలో చేరికలు ప్రారంభమవుతాయని టీడీపీ నేతల ద్వారా తెలిసింది. ప్రస్తుతం కూటమి చేతిలో 250 ఓట్లు ఉన్నాయని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవాలంటే 486 ఓట్లు రావాలని చెబుతున్నారు. ఈ ఎమ్మెల్సీ స్థానాన్ని కచ్చితంగా కూటమే గెలుచుకుంటుందని70 ఓట్ల మెజారిటీ కూడా సాధిస్తుందని ఆ పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

కాగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మొత్తం 838 మంది ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం వైసీపీకి 615, కూటమికి 218 ఓట్లు ఉన్నాయి. ఏజెన్సీలో వామపక్షాలకు 18 ఓట్లు ఉన్నాయి. వారు కూటమితో చెలిమికి అంగీకరించారు.

శ్రీదుర్గామల్లేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.5 లక్షలు

నర్సీపట్నం, ఆగస్టు 6 : శ్రీదుర్గామల్లేశ్వరస్వామి హుండీ ఆదాయం 69 రోజులకు రూ.5,05,865లు సమకూరినట్టు దేవదాయ శాఖ ఈవో దివ్య తేజ తెలిపారు. మంగళవారం హుండీ లెక్కించారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ కేబీ ఆశ కిరణ్మయి, శ్రీవారి సేవకులు, భక్తులు సమక్షంలో హుండీ ఆదాయం లెక్కించామని తెలిపారు.

26వ వార్డులో విద్యుత్ లో ఓల్టేజీ సమస్య పరిష్కారం

నర్సీపట్నం, ఆగస్టు 6 : మునిసిపాలిటీ 26వ వార్డులో లో-వోల్టేజీ సమస్య పరిష్కారం కోసం కృషి చేసిన కౌన్సిలర్ చింతకాయల పద్మావతికి స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. చాలా కాలంగా విద్యుత్ లో-వోల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతుండటంతో పద్మావతి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి ట్రాన్స్‌ఫారం వేయించారు. గతంలో సొంత నిధులతో విద్యుత్ స్తంభాలు వేయించారని అక్కడి ప్రజలు తెలిపారు.

మహా ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

ఆధ్వర్యంలోనే జరిగిపోతాయి కాబట్టి దానికి ఎనలేని ప్రాధాన్యం ఉంటుంది. ఏడాదిపాటు పదవిలో ఉండే స్టాండింగ్ కమిటీలో పది మంది సభ్యులకు అవకాశం ఉంది. వీరందరినీ జీవీఎంసీ పరిధిలోని కార్పొరేటర్లు రహస్య ఓటింగ్ పద్ధతిలో ఎన్నుకోవాల్సి ఉంటుంది. కూటమి నుంచి నొల్లి నూకరత్న (19వ వార్డు), గల్లా పోలిపల్లి (63వ వార్డు), శరగడం రాజశేఖర్ (56వ వార్డు), బొమ్మిడి రమణ (90వ వార్డు), గొలగాని వీరారావు (27వ వార్డు), పిసిని వరహానరసింహం (98వ వార్డు), పులి లక్ష్మీబాయి (75వ వార్డు), బల్ల శ్రీనివాసరావు (94వ వార్డు), పిళ్లా మంగమ్మ (ఏడో వార్డు)తోపాటు ఇండిపెండెంట్‌గా గెలిచి ఇటీవల టీడీపీలో చేరిన విల్లూరి భాస్కరరావు (35వ వార్డు) పోటీలో ఉన్నారు. వైసీపీ నుంచి అక్కరమాని రోహిణి (12వ వార్డు), రెయ్యి వెంకటరమణ (51వ వార్డు), మహ్మద్ ఇమ్రాన్ (66వ వార్డు), బిపిన్‌కుమార్‌జైన్ (31వ వార్డు), ముర్రువాణి (57వ వార్డు), సాడి పద్మారెడ్డి (24వ వార్డు), నక్కెళ్ల లక్ష్మి (20వ వార్డు), తోట పద్మావతి (34వ వార్డు), కరజాడ వెంకటనాగ శశికళ (55వ వార్డు), పల్లా అప్పలకొండ (28వ వార్డు) పోటీలో ఉన్నారు. జీవీఎంసీలో ప్రస్తుతం 97 మంది కార్పొరేటర్లు ఉన్నప్పటికీ, సీపీఎం కార్పొరేటర్ గంగారావు ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నట్టు ప్రకటించడంతో 96 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకుంటారు. దీని ప్రకారం ఎన్నికల్లో గెలవాలంటే ఒక్కో అభ్యర్థి కనీసం 49 ఓట్లు దక్కించుకోవాలి. కాగా ప్రస్తుతం కూటమిలో ఉన్న టీడీపీకి 36 మంది కార్పొరేటర్లు, జనసేనకు పది మంది కార్పొరేటర్లు, బీజేపీ నుంచి ఒకరు మొత్తం 47 మంది సభ్యుల బలం ఉంది. వీరితోపాటు సీపీఐ కార్పొరేటర్ ఏజే స్టాలిన్ కూటమికి మద్దతుగా ఓటేయాలని నిర్ణయించారు. ఇండిపెండెంట్ కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య కూడా కూటమికి మద్దతు ప్రకటించారు. దీంతో కూటమి బలం 49కి పెరిగింది. మరో నలుగురైదుగురు బుధవారం పార్టీలో చేరి నేరుగా పోలింగ్ కేంద్రానికి వస్తారని టీడీపీ నేతలు చెబుతున్నారు. అదే జరిగితే కూటమి అభ్యర్థుల విజయం నల్లేరు మీద నడకే అవుతుందనడంలో సందేహం ఉండదు. మరోవైపు వైసీపీ బలం ప్రస్తుతం 47కి తగ్గిపోయింది. వైసీపీ కార్పొరేటర్లతో నగరంలోని ఒక హోటల్‌లో పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త మంగళవారం సమావేశం ఏర్పాటుచేశారు. వారిలో నలుగురు కార్పొరేటర్లు సమావేశానికి గైర్హాజరయ్యారు. వారు కూటమిలో చేరిపోతారనే ప్రచారం జరుగుతోంది.

ఇరు వర్గాల్లోనూ క్రాస్‌ఓటింగ్ గుబులు

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూటమి నేతలతోపాటు వైసీపీ నేతలకు క్రాస్‌ఓటింగ్ భయం వెంటాడుతోంది. ఎన్నికల్లో విజయం సాధించడానికి కావాల్సిన కార్పొరేటర్ల బలాన్ని ప్రస్తుతం కూటమి సంపాదించినప్పటికీ, వైసీపీ నేతలు చేస్తున్న ప్రచారం వారిని ఆందోళనకు గురిచేస్తోంది. కనీసం ఐదుగురు తమ అభ్యర్థుల్లో నలుగురైదుగురికి అనుకూలంగా ఓటేస్తారని వైసీపీ నేతలు ధీమా వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు కూటమి నేతలు కూడా విజయానికి కావాల్సిన బలం తమకు ఉన్నప్పటికీ, వైసీపీలోని మరికొందరు కార్పొరేటర్లు తమ పార్టీల్లో చేరేందుకు ఆసక్తితో ఉన్నందున వారంతా రహస్యంగా తమ అభ్యర్థులకే ఓటేస్తారు కాబట్టి, తాము పది స్థానాలను దక్కించుకుంటామని టీడీపీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

చోడవరం
నియోజకవర్గం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

అనకాపల్లిలో మాలల యుద్ధభేరి సభ

▸▸ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం

▸▸ మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి సియ్యాద్రి శ్రీనివాసరావు

చోడవరం, ఆగస్టు 6: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా అనకాపల్లిలో మాలల యుద్ధభేరి సభ నిర్వహిస్తామని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి సియ్యాద్రి శ్రీనివాసరావు ప్రకటించారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో మంగళవారం నిర్వహించిన మాల మహానాడు ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు వెనుక మోదీ కుతంత్రం దాగి ఉందని ఆరోపించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం సాగించడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. అభివృద్ధి చెందుతున్న దళితులను అణచివేయడానికే క్రీమిలేయర్ అమలు చేసి రిజర్వేషన్లు ఎత్తివేయడానికి సన్నాహాలు చేస్తున్నారని విమర్శించారు. త్వరలోనే ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో మాల మహానాడు నాయకులు వేచలపు ప్రకాశ్, కొత్తపల్లి శ్రీనివాసరావు, హిందూ హక్కుల పోరాట సమితి నాయకులు బోనే గణేష్, బూసి కోటి, ఓం,ఈశ్వరరావు, పి.సన్యాసిరావు, నడుపూరి దేముడు, తాతాలు, పరవాడ అప్పారావు పాల్గొన్నారు.

చుండూరు దళితుల హత్యాకాండ దోషులను శిక్షించాలి

చోడవరం: చుండూరులోని దళితులపై సాగిన హత్యాకాండలో దోషులను శిక్షించాలని దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ డిమాండ్ చేశారు. 1991లో చుండూరులో ఎనిమిది మంది దళితులను హతమార్చారని, ఈ కేసులో ఇప్పటికీ దళితులకు సంపూర్ణ న్యాయం జరగలేదని వాపోయారు. అతని వెంట నాయకులు సత్యనారాయణ, బి.అప్పారావు, సన్యాసమ్మ, నరసయ్య, హుస్సేన్, బోడయ్య, ఈశ్వర్ గొల్లన్న, తారబి, పేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కళ్ల సమస్యలపై అశ్రద్ధ చేయొద్దు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు



కంటిలో చుక్కల మందు వేస్తున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 6: కళ్ల సమస్యలపై అశ్రద్ధ చేయకూడదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అన్నారు. వడ్డాది పీహెచ్‌సీలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మెగా నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం తాతయ్యబాబు మాట్లాడుతూ మనిషి దేహంలో కళ్లే అత్యంత ప్రధానమైనవన్నారు. కళ్ల సమస్యను అశ్రద్ధ చేయకుండా నేత్ర వైద్యులను సంప్రదించి వైద్య సేవలు పొందాలని సూచించారు. మారిన ఆహారపు అలవాట్లతో చాలా మంది రక్తపోటు, మధుమోహం వ్యాధులకు గురికావడంతో గ్లూకోమా (నీటి కాసులు) వ్యాధి బారినపడి కంటి చూపును కోల్పోతున్న సందర్భాలు అధికమన్నారు. ఈ శిబిరంలో డాక్టరు గీతాంజలి 120 మంది కంటి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 48 మందికి శస్త్ర చికిత్సలకు అవసమని గుర్తించి, శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు. మిగిలిన వారికి అవసర మైన మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు, టీడీపీ వడ్డాది పట్టణ అధ్యక్షుడు దొండా నరేష్, వివిధ పార్టీల నాయకులు దొండా గిరిబాబు, వీర్ల సురేష్, దొండా నారాయణమూర్తి, పీఏసీఎస్ కార్యదర్శి శాంతి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రాపవుట్లకు ఓపెన్ స్కూల్ వరం

రోలుగుంట, ఆగస్టు 6: డ్రాపవుట్ విద్యార్థులకు ఓపెన్ స్కూల్ ఓ వరమని ఎంఈవో జాన్ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం స్థానిక ఎమ్మార్సీ భవనం వద్ద ఓపెన్ స్కూల్ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడియట్ మధ్యలో ఆపేసిన వారు, ఉత్తీర్ణత సాధించని వారు అక్కడితో ఆగిపోకుండా ఓపెన్ స్కూల్ ద్వారా చదువు కొనసాగించవచ్చన్నారు. ప్రత్యేక అవసరాల గల వారికి, గ్రామీణ యువతకు విద్యనందించడమే ఓపెన్ స్కూల్ ముఖ్య ఉద్దేశమన్నారు. గ్రామ స్థాయి అధికారులు చదువు మధ్యలో మానేసిన వారిని గుర్తించాలని కోరారు. ఆగస్టు 28వ తేదీ వరకు ఓపెన్ స్కూల్‌లో చేరడానికి దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు 9492822280, 8074233168 నంబర్లను సంప్రదించాలని కోరారు. సీఆర్పీలు సతీష్, చిరంజీవి పాల్గొన్నారు.

అమ్మపాలే శ్రీరామరక్ష: డాక్టర్ మౌనిక

బుచ్చెయ్యపేట, ఆగస్టు 6: పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రీరామ రక్ష అని వడ్డాది పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక అన్నారు. తల్లిపాలవారోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె మాట్లాడుతూ శిశువు సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక, శారీరకంగా దృఢంగా ఎదిగేందుకు అమ్మపాలు అమృతంలా పనిచేస్తాయన్నారు. ఆపోహలను వీడి చంటి బిడ్డలకు పాలు ఇవ్వడం ద్వారా బిడ్డలతో పాటు తల్లి కూడా ఆరోగ్యంగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ అమ్మాజీ, రావికమతం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.రాజరాజేశ్వరీ, ఏఎన్ఎంలు, ఏఎస్‌హెచ్‌లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.


బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

రావికమతం, ఆగస్టు 6: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ చోడవరం నియోజకవర్గ కన్వీనర్ కె.రమణమూర్తి కోరారు. మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు గుటాల చిన్న అధ్యక్షతన మంగళవారం జరిగిన విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ఆగస్టు 15న ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయించాలని సూచించారు. అలాగే ప్రతీ కార్యకర్త రెండు మొక్కలను నాటాలని కోరారు. అనంతరం పార్టీ సభ్యత్వాల కోసం తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గల్లా రాజేశ్వరావు, మండల కార్యదర్శి దంట్ల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు విరమళ్ల శ్రీనివాసరావు, నాయకులు ఎస్.మహేష్, నక్కా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి

బుచ్చెయ్యపేట, ఆగస్టు 6: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని నిర్ణయించినట్టు అంబేడ్కర్ ఇండియా మిషన్ (ఏఐఎం) జిల్లా ఉపాధ్యక్షుడు నేతల భోగేష్ పిలుపునిచ్చారు. విజయరామరాజుపేట తులసీ కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన ఏఐఎం చోడవరం డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ చేస్తే ఎన్డీఏ కూటమికి పతనం తప్పదని హెచ్చరించారు. ఓట్ల రాజకీయాలకు మాల, మాదిగలను విడదీసేందుకు కుట్ర చేశారని ధ్వజమెత్తారు. వర్గీకరణ వ్యతిరేకంగా అంచెలంచెలుగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎం జిల్లా కన్వీనర్ పి.శివ, సభ్యులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన బండారు



కె.కోటపాడు, ఆగస్టు 6: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మంగళవారం అమరావతిలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా అప్పలరాజు



కె.కోటపాడు తాలుకా ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

కె.కోటపాడు, ఆగస్టు 6: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కె.కోటపాడు తాలుకా యూనిట్ అధ్యక్షుడిగా ఎస్.అప్పలరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపీడీవో సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన ఈ ఎన్నికలకు అధికారిగా జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు వ్యవహరించారు. యూనిట్ కార్యదర్శిగా పి.శంకర్రావు అసోసియేట్‌గా కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్ బి.వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. అలాగే కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎన్.రామునాయుడు, బి.శంకరరావు, ఎల్.బి.సుశీల, రాజేశ్వరరావు, సంయుక్త కార్యదర్శులుగా కె.శ్రీను, జి.సంతోష్, నళిని, కోశాధికారిగా డాక్టర్ నిర్మల (చౌడువాడ పీహెచ్‌సీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఎ.నాగేశ్వరరావు, సహాయ ఎన్నికల అధికారిగా ఎస్.కె.బాబూరావు, పరిశీలకులుగా ఎస్‌వీ రమణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

▸▸ ఆరోగ్యశ్రీ డిప్యూటీ కో ఆర్డినేటర్ రంజిత్

చోడవరం, ఆగస్టు 6: గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యశ్రీ డిప్యూటీ కోఆర్డినేటర్ డాక్టర్ రంజిత్ సూచించారు. మండలంలోని గోరిపట్నంలోని 104 వాహనం ద్వారా అందిస్తున్న సేవలను మంగళవారం పరిశీలించారు. అలాగే మందుల నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆయన మాట్లాడుతూ 104 సేవలు మరింత విస్తృతంగా అందేలా చర్యలు తీసుకోవాలని, గడువు దాటిన మందులను క్షుణ్ణంగా పరిశీలన చేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 104 సేవలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 104 ఆపరేషన్స్ అధికారి వి.కుమార్ అంజనయ్య, డీఎం కె.అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల
నియోజకవర్గం

చల్లబడిన వాతావరణం

మాడుగుల, ఆగస్టు 6: మండలంలో వాతావరణం మారిపోయింది. వేసవి మాదిరిగా గత వారం రోజుల నుంచి భానుడి ప్రతానికి ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు, మంగళవారం మబ్బులు వేయడంతో సేదదీరారు. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ఉపశమనం పొందారు.

చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి

చీడికాడ, ఆగస్టు 6: మండలంలోని తురువోలు గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న రావిబంద చెరువులో 60 చెట్లను అక్రమంగా నరికి విక్రయించారని గ్రామ నాయకుడు చెవ్వేటి వెంకటరావు ఆరోపించారు. దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా ఏ విధమైన చర్యలు తీసుకోలేదని వాపోయారు. మరోమారు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. దీనిపై ఇన్‌చార్జి తహసీల్దార్ పొట్నూరి రమేష్‌ను వివరణ కోరగా, ఫిర్యాదు అందిన వెంటనే గ్రామంలోకి వెళ్లి ఆయకట్టు రైతులతో విచారించగా, పంట పొలాలకు అడ్డంగా ఉన్న నేరేడు, తాటిచెట్లను నరికివేశామని రైతులు ఎండార్స్‌మెంట్ ఇచ్చారన్నారు. వెంటనే ఫిర్యాదుదారునికి అధికారికంగా ఎండార్స్‌మెంట్ అందించామని ఆయన చెప్పారు.

ఓపెన్ స్కూల్ పోస్టర్ విడుదల

చీడికాడ, ఆగస్టు 6: ఓపెన్ స్కూల్‌లో చేరేందుకు ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో కె.బొంజుబాబు మంగళవారం తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను విడుదల చేశారు. 18 సంవత్సరాలు నిండి చదవడం, రాయడం వచ్చిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పదో తరగతి పాసైన వారు ఇంటర్‌లో చేరేందుకు దరఖాస్తులు చేయాలని ఆయన కోరారు.

ఎస్సీ వర్గీకరణపై హర్షం

మాడుగుల రూరల్, ఆగస్టు 6: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుపై ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం కేజే పురంలో బాబు జగ్జీవన్‌రావ్ యువజన సంఘం ఆధ్వర్యంలో మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మార్తా శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నేత కండెల్లి వెంకటరావు మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు అందరి జీవితాల్లో వెలుగు నింపిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు చిన్నందాలిబాబు, జగ్గప్పారావు, మాలిబాబు, కొండారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.14 లక్షలతో పాఠశాల భవన నిర్మాణం

కె.కోటపాడు, ఆగస్టు 6: మండలంలో గొందుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదులను రూ.14 లక్షలతో నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా భవన నిర్మాణ శ్లాబు పనులను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి.కనకమల్లేశ్వరి, ఎంపీటీసీ సభ్యురాలు వంటాకు నారాయణమ్మ, హెచ్ఎం రొంగలి నాగేశ్వరరావు, పీడీ రోహిణి, టీడీపీ నేత బండారు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాల విశిష్టతపై అవగాహన

▸▸ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల

కె.కోటపాడు, ఆగస్టు 6: తల్లి పాల విశిష్టత పై గర్భిణిలకు, బాలింతలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎల్.బి.సుశీల అవగాహన కల్పించారు. తల్లి పాల వారోత్సవాల సందర్భంగా గొట్లాం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, సహాయకులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సుశీల మాట్లాడుతూ పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు అందించాలన్నారు. తల్లిపాలలో వ్యాధి నిరోధకశక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని చెప్పారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది జీఎంఎస్‌కె శ్రావంతి, పాతవలస, మర్రివలస, వెంకటలక్ష్మి, ఆర్.లక్ష్మి, జి.నాగమణి పాల్గొన్నారు.